ప్రజాశక్తి

బుధవారం 1 మే 2024

8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

మళ్లీ పింఛన్ టెన్షన్

- నేటి నుంచి 5 వరకు పంపిణీ
- లబ్ధిదారులకు బ్యాంక్ ఖాతాలో
- బ్యాంక్ ఖాతా లేని వారికి ఇళ్ల వద్దే
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో 4,81,629 పింఛన్‌దారులు
- పంపిణీ చేయాల్సిన మొత్తం రూ.142.98 కోట్లు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

సామాజిక పింఛన్‌దారులకు మళ్లీ టెన్షన్ మొదలైంది. గత నెల పెన్షన్లు తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం నుంచి మేలో పెన్షన్లు పంపిణీ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. మే 1వ తేదీ నుండి ఐదో తేదీ వరకు సామాజిక పింఛన్లు పంపిణీ చేయనున్నారు. బ్యాంక్ ఖాతా ఉన్న లబ్ధిదారులకు వారి బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నారు. బ్యాంకు ఖాతా లేని లబ్ధిదారులకు మాత్రం ఇంటింటికి వెళ్లి పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు.

ఎన్నికల సమయంలో వద్దులకు, వితంతు మహిళలకు, వికలాంగులకు పింఛను పంపిణీకి ఎన్నికల సంఘం కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. కోర్టు తీర్పు నేపథ్యంలో వాలంటీర్లతో పంపిణీ చేయించవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్ర ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు కిందటి నెల నుంచి వాలంటరీలతో కాకుండా సచివాలయం ఉద్యోగులు పింఛను పంపిణీ చేశారు. అధికారులు ఇంకో అడుగు ముందుకేసి మే పింఛను లబ్ధిదారులకు బ్యాంక్ ఖాతాలో జమచేస్తామని ప్రకటించారు. అయితే దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. (మిగతా 2లో)



ప్రాణం పోయాల్సిన డాక్టరే...

- కుటుంబాన్ని కడతేర్చి తానూ తనువు చాలించాడు
- ఆర్థిక ఇబ్బందులే కారణంగా భావిస్తున్న పోలీసులు

ఆత్మహత్య చేసుకున డాక్టర్ శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: డాక్టర్ దేవుడితో సమానమని నమ్ముతాం. అందుకే మనకు శరీరంలో ఎటువంటి ఇబ్బంది, తేడా వచ్చినా డాక్టర్ వద్దకు వెళ్లి చెప్పుకుంటాం. కానీ ప్రాణం పోసే డాక్టరే తీవ్ర మనస్థాపానికి గురై తీవ్ర మానసిక వత్తిడికిలోనై తాను చనిపోవడమే కాకుండా భార్య, ఇద్దరు సంతానంతో పాటు తల్లిని కూడా చంపిన ఘటన నగరంలో తీవ్ర కలకలం రేపింది. ఈ సంఘటన గురునానక్ కాలనీలో చోటుచేసుకుంది. కుటుంబ, ఆర్థిక (మిగతా 2లో)

రోధిస్తున్న బంధువులు; మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం

రోడ్ షోలు... బైక్ ర్యాలీలు

ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు, మచిలీపట్నం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గొల్లు కృష్ణ మంగళవారం కృష్ణాజిల్లా నున్నలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఈ ప్రచారంలో పాల్గొన్నారు. విజయవాడ సెంట్రల్ సిపిఎం అభ్యర్థి సిహెచ్.బాబురావు, కాంగ్రెస్ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి వల్లూరు భార్గవ్‌లకు మద్దతుగా సిపిఎం, కాంగ్రెస్, సిపిఐ, ఆర్‌జెడి, ఆమ్‌ఆద్మీ పార్టీల నేతృత్వంలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రోడ్ షో నిర్వహించారు.

... పూర్తి వివరాలు మధ్య పేజీలో

నున్నలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

విజయవాడ సెంట్రల్‌లో ఇండియా వేదిక అభ్యర్థుల రోడ్ షో

సిపిఎం పోరాటాలతో వేల మందికి ఇళ్ల స్థలాలు

గన్నవరం నియోజకవర్గంలో చెరగని ముద్ర వేసిన ఉద్యమాలు

కథనాలు మధ్య పేజీలో

ప్రజాప్రతినిధిగా ఎలా ఉండాలో చూపిన సుందరయ్య

మేడే శుభాకాంక్షలతో...

కార్మికులకు, కర్షకులకు, శ్రామికులకు

నేడు అంతర్జాతీయ కార్మిక దినోత్సవం

మేడే శుభాకాంక్షలు

జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి

వైఎస్ఆర్‌సిపి నాయకులు, విజయవాడ.

మొదటిపేజీ తరువాయి

ప్రాణం పోయాల్సిన డాక్టరే...

ఇబ్బందులతో పాటు కొంత మంది స్నేహితుల నమ్మక ద్రోహం కారణంగానే ఈ సంఘటన చోటుచేసుకోవడం సంచలనం కలిగించింది. నగరానికి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ చక్కటి వైద్యం చేయడంతోపాటు అందరినీ చిరునవ్వుతో పలుకరిస్తూ వ్యాధిని సగం తగ్గిస్తుంటారని చెబుతుంటారు. అటువంటిది ఆయనే తనకు వచ్చిన కష్టం ఎవరికీ చెప్పుకోలేక తీవ్ర మనస్తాపం చెంది చివరకు ఆత్మహత్యచేసుకున్నారు. నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో సుమారు ఐదేళ్లపాటు వైద్యునిగా సేవలందించి తనే సొంతంగా ఆసుపత్రి ప్రారంభించి ఇంకా ఎక్కువ మందికి వైద్య సేవలు అందించాలని ఆశించారు. పుష్పా హోటల్ సెంటర్ సమీపంలో కొద్దిపాటి స్థలంలో అత్యాధునిక సదుపాయాలతో ఏడాదిన్నర క్రితం ఆసుపత్రిని నిర్మించి ప్రారంభించారు. అయితే అనుకున్న స్థాయిలో రోగులు రాకపోవడం.. రోజురోజుకూ నిర్వహణా భారం పెరగడంతో ఆసుపత్రి నడపటం సాధ్యం కావడం లేదు. దీంతో ఇటీవలే నిడమానూరుకు చెందిన ఓ ప్రయివేటు ఆసుపత్రికి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. దీంతోపాటు ఇదే ఆసుపత్రిలో తాను కూడా సేవలు అందించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. నెల క్రితం కొత్త యాజమాన్యం ఆసుపత్రికి అన్ని హంగులు ఏర్పాటుచేసి ప్రారంభించింది. అయితే అప్పటికే ఆర్థిక భారంతోపాటు కొందరు స్నేహితులు కూడా నమ్మపలికి కొంత మోసం చేయడంతో డాక్టర్ శ్రీనివాస్ పూర్తిగా డిప్రెషన్లోకి వెళ్లిపోయాడని బంధువులు, పోలీసులు చెబుతున్నారు. తన పిల్లలన్నా, భార్య, తల్లి అన్నా శ్రీనివాస్‌కు ఎంతో ఇష్టమని చెబుతున్నారు. తాను ఆత్మహత్య చేసుకుంటే వారిని ఎవరు చూస్తారని భావించి హత్య చేసినట్లు చెబుతున్నారు. తన ఇద్దరు పిల్లల్లో ఒకరు ఆటిజం సమస్యతో బాధపడుతున్నారు. దీంతో కుమార్తె ఇంటికి సమీపంలోనే ప్రయివేటు పాఠశాలలో చదువుతోంది.

విచారణ వేగవంతం

గురునానక్ కాలనీలో నివాసం ఉంటున్న డాక్టర్ డి.శ్రీనివాస్ (40) తన భార్య ఉష (38), కుమార్తె శైలజ (9), శ్రీహాన్ (8), తల్లి రమణమ్మ (65)లను గొంతుకలు కోసి చంపి, ఆ తర్వాత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. మంగళవారం వెలుగుచేసిన ఈ కేసులో శ్రీనివాస్ కారులో ఉన్న ట్రావెల్ బ్యాగును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంటి ఆవరణలోనే ఉన్న కారులో ఉంచిన బ్యాగులో విలువైన వస్తువులు, డాక్యుమెంట్లు, బంగారు ఆభరణాలు, కొద్ది మొత్తంలో నగదు ఉన్నట్లు గుర్తించారు. ఎదురింట్లో ఇచ్చిన తాళం ద్వారా కారు తెరచి చూడగా అందులో బ్యాగు లభ్యమైంది. కారు తాళాలను తన అన్నకు ఇవ్వాలని రాసి ఎదురింటి పోస్ట్‌బాక్స్‌లో వేసిన లెటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యుల మృతదేహాలను పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మందుల షాపులో రెండు కత్తులు కొనుగోలు

డాక్టర్ శ్రీనివాస్ కుటుంబంలో విషాదాన్ని పరిశీలిస్తే... పథకం ప్రకారమే ఈ ఘటన జరిగినట్లు అర్థమవుతోందని పోలీసులు చెబుతున్నారు. సోమవారం సాయంత్రం శ్రీనివాస్ తన ఇంటికి సమీపంలోని మెడికల్ షాపులో రెండు సర్జికల్ కత్తులను కొనుగోలు చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. ఆ మెడికల్ షాపుకు వెళ్లి ఎప్పుడు ఏమి కొన్నదీ సిసి కెమెరా ద్వారా పరిశీలిస్తున్నారు.

శ్రీనివాస్ మంచి వ్యక్తి : స్నేహితులు

డాక్టర్ శ్రీనివాస్ చాలా మంచి వ్యక్తని, అందరితో చక్కగా మాట్లాడతారని, ఎవరితోనూ విభేదాలు లేవని ఆయన స్నేహితులు తెలిపారు. గత ఏడాదే సొంతంగా శ్రీజ హాస్పిటల్‌ను ప్రారంభించారని తెలిపారు. అయితే హాస్పటల్ పూర్తి స్థాయిలో నడవకపోవడంతో కొంత ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పాడని వివరించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఇలా చేసి ఉండొచ్చని స్నేహితులు భావిస్తున్నారు. భార్యను, ఇద్దరు పిల్లలను, తల్లిని హత్య చేశాడంటే నమ్మలేకపోతున్నామని ఆదేదన వ్యక్తం చేశారు.

బాబు, పవన్‌లది దగాకోరు మేనిఫెస్టో : పేర్ని

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి: టిడిపి, జనసేన పార్టీలు దగాకోరు మేనిఫెస్టోను విడుదల చేశాయని, జనానికి టోపీ పెట్టడానికే టిడిపి, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు కాగితాలపై ఆరచేతిలో వైకుంఠం చూపారని మాజీ మంత్రి, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) విమర్శించారు. మంగళవారం మచిలీపట్నం అరుణోదయ కాలనీలో ఆయన మీడియాతో మాట్లాడారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఉమ్మడి మేనిఫెస్టోతో ఏపి ప్రజల జీవితాలు మార్చుతామని చెప్పారని, కానీ బాబు, పవన్ ఫొటోలకే మ్యానిఫెస్టో పరిమితమైందని అన్నారు. రెండు పార్టీలు ఇస్తున్న ఎన్నికల హామీలపై బిజెపి సంతకం పెట్టే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. టిడిపి, జనసేన రెండు పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయనే కారణంతోనే బిజెపి మ్యానిఫెస్టోకు దూరమైందన్నారు. వైసిపి మేనిఫెస్టోను, కర్నాటకలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోను కాపీ చేశారని ఎద్దేవా చేశారు. జగన్ పథకాలకే అదనంగా మరింత ఇస్తామని చెప్పారన్నారు. రాష్ట్ర ఆదాయ, వ్యయాలను పరిగణలోకి తీసుకోలేదన్నారు. గత మేనిఫెస్టో పక్కన పెట్టుకుని ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశామని ముఖ్యమంత్రి జగన్ ధైర్యంగా చెప్పగలిగారన్నారు. చంద్రబాబు నిజాయితీకలవారైతే ఇదే కూటమి 2014 మేనిఫెస్టోలో చెప్పిన హామీలు ఎన్ని అమలు చేశారో చెప్పే ధైర్యం చేయలేకపోయారన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని అమాంతం పెంచి మేనిఫెస్టోలో చెప్పిన పథకాలు అమలు చేస్తామని టిడిపి, జనసేన నేతలు చెప్పడం అర్థరహితమన్నారు. రాష్ట్రాన్ని బాగుచేయడానికి మాత్రమే బిజెపితో ఎన్‌డిఎతో కలిశామని చంద్రబాబు, పవన్ చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన ప్రత్యేక హోదా తీసుకు వస్తామని, విభజన హామీలు అమల్లో భాగంగా కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, కేంద్ర సహకారంతో పోర్టు నిర్మిస్తామని, రైల్వే జోన్ తీసుకు వస్తామని ఎక్కడా చెప్పలేదన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని వేలం వేయకుండా ఆపుతామని హామీల్లో చెప్పలేదన్నారు.

పార్లమెంట్‌లో 545పైగా సీట్లు ఉంటే ఎన్‌డిఎకు 400 సీట్లు ఇవ్వాలని టిడిపి, జనసేన నేతలు కోరుతున్నారని, ఎంత మందిని కాల్చుకుతినడానికి, ఎంత మంది మైనార్టీలను ఈ దేశంలో లేకుండా తోలేయడానికి మీకు అత్యధిక మెజార్టీ కావాలా అని చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లను నాని ప్రశ్నించారు. ఎవరి ఓట్లన్నా, పౌరసత్వాలన్నా తొలగిస్తారా? ఏ దూడుకు చర్యలు చేపట్టడానికి మీకు నాలుగు వందల సీట్లు కావాలో చెప్పాలన్నారు. ఎవరైనా తమ ప్రభుత్వానికి సీట్లు ఇవ్వండి ప్రజలకు ఈ మంచి చేస్తామని మాట్లాడతారని, దీనికి భిన్నంగా నాలుగు వందల సీట్లు అడుగుతున్న మీ ఇద్దరు బిజెపితో కలిసి దేశాన్ని ఏమి చేద్దామనుకుంటున్నారని నిలదీశారు.

మళ్లీ పింఛన్ టెన్షన్

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో 4,81,629 పింఛనుదారులు ఉన్నారు. వీరికి రూ.142.98 కోట్లను పంపిణీ చేయాల్సి ఉంది. మొత్తంగా 17 రకాల పెన్షన్లను లబ్ధిదారులు అందుకుంటున్నారు. వీటిలో వద్ధాప్య పెన్షన్లే అగ్రభాగాన ఉన్నాయి. వీరిలో దాదాపు 60 శాతానికిపైగా 70 ఏళ్ల పైబడినవారే ఉన్నారు. వీరంతా ఎండల్లో బయటకు వెళ్లాల్సి రావడం ఇబ్బందికరమైన అంశమే. 80 ఏళ్లు దాటి కదల్లేని స్థితిలో ఉన్నవారు 10 శాతం వరకు ఉంటారు. వీరంతా బ్యాంకులకు వెళ్లి డబ్బు తెచ్చుకోవడం కష్టమే. సీనియర్ సిటిజన్లు, బ్యాంక్‌లో అకౌంట్ ఉన్న వారు ప్రతి నెలా కొంత మొత్తం మినిమం బ్యాలెన్స్ మెయింటెనెన్స్ చేయాల్సి ఉంది. అయితే లబ్ధిదారుల్లో ఎక్కువ మంది వద్ధులు, వికలాంగులు, వితంతువులు, మరికొంత మంది మినిమం బాలెన్స్ కూడా మెయింటెనెన్స్ చేసే పరిస్థితిలేదు. పింఛన్ లబ్ధిదారుల ఖాతాలో మైనస్ బ్యాలెన్స్‌లో ఉన్నది. మరి కొంతమందికి ఆధార్ లింకుతో ఉన్న బ్యాంక్ అకౌంటు ఎన్‌పిఎ లో కూడా ఉన్నాయి. పింఛన్ డబ్బు జమకాగానే మైనస్ బాలెన్స్ ఉంటే బ్యాంక్ అధికారులు కట్ చేసుకుంటారని, ఎన్‌పిఎలో ఉన్న ఎకౌంటు మళ్లీ యాక్టివేషన్ చేయించుకునేంతవరకు డబ్బులు రావని ఆందోళన చెందుతున్నారు. రూ.3 వేల పెన్షన్ మొత్తంలో కొంత మొత్తాన్ని మైనస్ బ్యాలెన్స్‌గా బ్యాంక్ అధికారులు కట్ చేసుకుంటే తమకు వచ్చే పెన్షన్ రోజువారి అవసరాలు సరిపోవని, పూట గడవటం చాలా కష్టంగా ఉంటుందని లబ్ధిదారులు వాపోతున్నారు. మినిమం బ్యాలెన్స్ మెయింటెనెన్స్ లేకుండా లబ్ధిదారులకు పెన్షన్ డ్రా చేసుకునే అవకాశం ఉండదన్నారు. అదేవిధంగా మైనస్ బ్యాలెన్స్‌లో ఉన్న అకౌంట్ కచ్చితంగా బ్యాంక్ అధికారులు తమకు రావాల్సిన డబ్బును కట్ చేసుకుంటారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు పెన్షన్లు ఇవ్వటానికే బ్యాంకులు పనిచేయవు. అదనపు సిబ్బంది ఉండరు. ఈ విధానం వల్ల బ్యాంకుల్లో గంటల తరబడి పడిగాపులు పడాల్సి ఉంటుందని వద్ధులు ఆందోళన చెందుతున్నారు. మండుటెండల్లో వద్ధులు బ్యాంకులకు వెళ్లగలరా? వెళ్లినా క్యూల్లో నిలబడగలరా? డబ్బు తీసుకునే విత్‌డ్రా ఫారాలను పూర్తిచేయగలరా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతనెల పెన్షన్ తీసుకోవటానికి మూడు రోజుల సమయం కూడా పట్టింది. మండలంలో ఒకేఒక బ్యాంకు శాఖ ఉంటుంది. అంటే ఆయా గ్రామాలు, వార్డుల్లోని పెన్షన్‌దారులంతా ఆ బ్యాంకు దగ్గరకే వెళ్లడం వల్ల రద్దీ పెరుగుతుంది. వందల సంఖ్యలో వచ్చే వద్ధులకు బ్యాంకులు తగిన ఏర్పాట్లు చేసే పరిస్థితి లేదు. బ్యాంకులో వేసిన పెన్షన్ సొమ్మును డ్రా చేసుకోవడం కోసం తీవ్రమైన ఎండలో బ్యాంకు చుట్టూ తిరుగుతూ పడిగాపులు పడాలని భయపడుతున్నారు. మండుటెండల్లో వద్ధులకు ఏదైనా జరగరానిది జరిగితే బాధ్యత ఎవరిదనే వాదన వినిపిస్తోంది. బ్యాంకుల్లో కంటే సచివాలయాల్లో ఇవ్వడమే మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్యాంకు ఖాతాలో మైనస్ బ్యాలెన్స్ ఉన్న ఖాతాలను, ఎన్‌పిఎ లో ఉన్న ఖాతాలను పరిశీలించి పింఛన్ సొమ్మును నేరుగా ఖాతాలో జమ చేయకుండా తమ చేతికి ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు. లేకపోతే సచివాలయాల అధికారులతో పంపిణీ చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఒరిజినల్ సేల్‌డీడ్ డాక్యుమెంట్ పోయినది

కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, గుడ్లవల్లేరు గ్రామం, నెహ్రూ నగర్ కాపురస్తులు, సూరపనేని కళ్యాణ్ చక్రవర్తి, S/o వెంకట రాఘవేంద్రరావు, వయసు 44 సంవత్సరాలు కు సంబంధించిన ఒరిజినల్ సేల్ డీడ్ మరియు లింక్ డాక్యుమెంట్ నంబర్. 2554/2017, తేది 03-07-2017 కు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ ది.22.04.2024 న విజయవాడ నుండి ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ కు బైక్ పై వెళ్తుండగా మార్గమధ్యంలో పడిపోయినవి. కావున పై నంబర్ గల ఒరిజినల్ సేల్ డీడ్ డాక్యుమెంట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ ను సంప్రదించగలరు.

సూరపనేని కళ్యాణ్ చక్రవర్తి
S/o వెంకట రాఘవేంద్రరావు,
డోర్ నెంబర్.9-116,
నెహ్రూ నగర్, గుడ్లవల్లేరు గ్రామం, కృష్ణాజిల్లా
సెల్.9290851592

ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది

నా క్లయింట్ కృష్ణాజిల్లా, ఉయ్యూరు నగరపంచాయతీ, ఫైర్ స్టేషన్ రోడ్డు, శ్రీసాయి రెసిడెన్సీ, ఎస్-6, 2వ అంతస్తు, డోరు నెం.6-233 వాస్తవ్యులు చందు వెంకటేశ్వరరావుగారి కుమారుడు చందు. వెంకట సుదర్శనరావు గారు **No. N2032487** గల ఇండియన్ పాస్‌పోర్టు కలిగియున్నారు. నా క్లయింట్ సదరు పాస్‌పోర్టు ఒరిజినల్ బుక్ జిరాక్స్ తీయించు నిమిత్తం ఒక కవర్లో పెట్టుకొని మోటారు సైకిల్‌పై ఫైర్‌స్టేషన్ రోడ్డులో గల నా క్లయింట్ ఇంటి వద్ద నుండి ఉయ్యూరు కోర్టు దగ్గరలో ఫొటోస్టాట్ సెంటరుకు వెళ్ళుచుండగా మార్గమధ్యమంలో నా క్లయింట్ బండిపైన ఉన్న కవర్లో గల ఇండియన్ పాస్‌పోర్టు ఒరిజినల్ బుక్ మార్గమధ్యమంలో నా క్లయింట్ వద్ద నుండి జారిపడి పోయినది. పై తెలిపిన ఒరిజినల్ పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలియ జేయవలసినదిగా కోరడమైనది.

చందు. వెంకట సుదర్శనరావు
ఫైర్ స్టేషన్ రోడ్డు, ఉయ్యూరు.
సెల్ : 9059613795

పొలం డాక్యుమెంట్లు పోయినవి

కొండపల్లి రాజ్యలక్ష్మి W/o (లేటు) కొండపల్లి శివ వెంకట ప్రసాద్, నివాసం : డోర్ నెం. 433, పాత రాజీవ్‌నగర్, పాయకాపురం, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా.

నా యొక్క పొలం డాక్యుమెంట్లు, 5వ పోలీస్‌స్టేషన్, విజయవాడ ప్రక్కన ఉన్న బస్‌స్టాపులో పోయినవి. ది.29-4-2024వ తేదీన 5వ టౌన్ పోలీస్‌స్టేషన్ ప్రక్కన వున్న బస్‌స్టాపులో బస్సు ఎక్కుతుండగా గన్నవరం మండలం, పురుషోత్తపట్నం గ్రామం, సర్వే నెం. 195-6, 195-8లో వున్న పొలం డాక్యుమెంట్లు కలిగివున్న బ్యాగ్ పోయినది. కావున ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది ఫోన్ నెంబర్‌కు తెలియపర్చగలరని కోరుతున్నాను.

ఫోన్ : 8985757761, 9082548032.

పేరు మార్పు

నేను గంటా సంధ్యారాణి W/o గంటానాయుడు, నివాసం : డోర్ నెం. 5/1/6, ముదినేపల్లి, కృష్ణాజిల్లా. నా యొక్క పూర్వపు పేరు గంటా సంధ్యారాణి W/o గంటా నాయుడు.

2వ వివాహం తర్వాత నా పేరును గంటా సంధ్యరాణి నుండి దువ్వూరి సంధ్యారాణి W/o దువ్వూరి రామాంజనేయులుగా మార్పు చేయడం జరిగినది. ఈ రోజు నుండి నా పేరును దువ్వూరి సంధ్యారాణి, W/o దువ్వూరి రామాంజనేయులు గా పిలవటం జరుగుతుంది.

BEFORE THE COMMISSIONER FOR EMPLOYEES COMPENSATION CUM DEPUTY COMMISSIONER OF LABOUR-I T.ANJAIAH BHAVAN RTC 'X' ROADS AT HYDERABAD
E.C.No. 36 of 2022

Between:
M. Satyanarayana ...Applicant
AND
M. Sravan Kumar & another ...Opp. Parties

To,
M. Sravan Kumar C/o. M. Subba Rao, R/o. Old MIG 67/3, Near Ramalayam Temple, Bhavanipuram, Vijayawada Urban, Krishna Dist. (A.P.) - 520012.
...Opp.Party No.1

Take notice that the above applicant had filed the case against you for grant of compensation for the injuries sustained by him in motor accident and the case is posted to 19-6-2024 at 3-00 PM for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either in person or through an advocate, else the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)
M.RAJESH KHANNA
Advocate
Off: Flat No.226, Jamuna Towers, Opp: Yashoda Hospital, Malakpet, Hyderabad-500036.

IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL III ADDNL DISTRICT JUDGE AT: KHAMMAM
M.V.O.P.NO. 431 OF 2023

BETWEEN:-
Charpa Rajeswari & Another ... Claim Petitioner
AND
Jupalli Radhakrishna Rao & Another ....Respondents

Notice

To,
Jupalli Radha Krishna Rao, S/o. Rajeswar Rao jupalli, Age: 35 Yrs, Occ: Driver & Owner of goods carriage bearing Ap No 16 TJ 4829,R/o: D.No. 128/2 Old Mig, Housing Board Colony, Bhavanipuram, Vijayawada Urban, Vijayawada

Whereas the claim Petitioner has filed claim petition claiming compensation on account of death of Charpa Prasad in a motor accident on 05.12.202. You are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions on the **21st Day of May 2024 (21.05.2024)** at 10-30 O'clock in the forenoon to answer the claim, and further you are hereby directed to file within 30 days of service of this summon a counter of your defense and to produce on the said day all documents in your possession or power upon which you base your defense

By order of the court
Patibandla Sanjay Kumar,
Advocate, Khammam
9848144038

మహారాజశ్రీ గౌరవనీయులైన 3వ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు, విజయవాడ నందు
ఇ.పి. నెం.20/2019 ఇన్ ఓ.యస్. నెం.30/2010

మధ్య
ఐత రామలింగేశ్వరరావు .... డిక్రీ హోల్డర్
మరియు
యం.ఇందిర మరియు ఇద్దరు .... జడ్జిమెంట్ డెటార్స్,
నాగోతి రషిత, తండ్రి : దుర్గా మల్లేశ్వరరావు, డోర్ నెం. 9-79-7, ధర్మపురివారి వీధి, కొత్తపేట, విజయవాడ. ఎన్‌టిఆర్ జిల్లా - 520 001.

పై నెంబరు దావాలో ఉదహరించిన ఎగ్జిక్యూషన్ పిటీషన్ నందు శ్రీ కోర్టువారు తమరు ఎన్నిసార్లు నోటీసులు పంపించినా, తమరు తీసుకోనందున శ్రీ కోర్టువారు ది. 24-4-2024వ తేదీన పత్రికా ముఖంగా నోటీసులు జారీ చేయుటకు ఆర్డరు జారీ చేసియున్నారు. కావున తమరు ది. 09-05-2024 తేదీ ఉదయం 10-30 గం.లకు మీరు గాని లేక మీ తరఫున న్యాయవాది గారు గానీ హాజరు అయి తమ యొక్క అభ్యంతరాలు తెలుపుకొన గలరు. లేనియెడల శ్రీ కోర్టువారు పై ఉదహరించిన పిటీషన్ తమ పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేదీ : 09-05-2024

ఇట్లు
డి.బుచ్చిబాబు,
డిక్రీహోల్డర్ తరఫు అడ్వకేటు,
సత్యనారాయణపురం, విజయవాడ.
ఫోన్ : 9490608033.

72 గంటల ముందే

బల్క్ ఎస్ఎంఎస్‌లు నిలిపివేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా పోలింగ్ కు 72 గంటల ముందు రాజకీయ ప్రచార బల్క్ ఎస్ఎంఎస్ లు, వాయిస్ మెసేజ్ లు నిలుపు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సర్వీస్ ప్రొవైడర్స్ కు సూచించారు. జిల్లా కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్లో తమ చాంబర్లో వివిధ నెట్వర్క్ సర్వీస్ ప్రొవైడర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 13వ తేదీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్న దష్ట్యా, పోలింగ్ తేదీకి 72 గంటల

మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ముందు అంటే మే నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు వారి రాజకీయ ప్రచార ప్రకటనలకు సంబంధించిన బల్క్ ఎస్ఎంఎస్ లు, వాయిస్ మెసేజ్ లను పంపకూడదని, అలా పంపితే ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలుగా పరిగణించబడతాయన్నారు. కావున వాటిని నిలువ రించాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వివిధ నెట్వర్క్ ప్రొవైడర్స్ కు కలెక్టర్ సూచించారు. మే 10వ తేదీ కంటే ముందు బల్క్ ఎస్ఎంఎస్ లు, వాయిస్ మెసేజ్ లు పంపాలంటే ఎంసీఎంసీ నుండి ప్రీ సర్టిఫికేషన్ పొందవలసి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె. చంద్రశేఖర రావు, కమ్యూనికేషన్ నోడల్ అధికారి ఎస్. ఎస్. కష్ణ, ఎంసిసి నోడల్ అధికారి హాజీబేగ్, మీడియా నోడల్ అధికారి ఎంకటేశ్వర ప్రసాద్, బిఎస్ఎన్ఎల్ ఏజీఎం ఈ. శ్రీనివాసరావు, ఏపీ ఫైబర్ నెట్ ప్రతినిధి అబ్బాస్ హుస్సేన్, ఎయిర్టెల్ మేనేజర్ కే శ్యాంబాబు, ఎయిర్టెల్ వైఫై ప్రతినిధి లక్ష్మీనారాయణ, జియో నెట్వర్క్ ప్రతినిధి రవి తదితరులు పాల్గొన్నారు.

కైలేను సన్మానిస్తున్న దృశ్యం

మంచి జరిగితేనే ఓటు వేయండి : కైలే

ప్రజాశక్తి-పెదపారుపూడి : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి కైలే అనిల్ కుమార్ మండలంలోని వెంట్రప్రగడ, వానపాముల, కొర్నిపాడు, రావులపాడు, పాములపాడు, జమీదింట కుర్రు, గురువిందగుంట, మహేశ్వరపురం, దూళ్ల వానిగూడెం గ్రామాలలో రోడ్ షో మంగళవారం నిర్వహించారు. వెంట్రప్రగడ శివారు పులవర్తి గూడెంలో కైలే మాట్లాడుతూ వైసిపి అధికారం చేపట్టిన ప్పటినుండి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలలో 99 శాతం పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. పార్టీలకతీతంగా, కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. గత టిడిపి పాలనలో ఏమి జరిగింది, వైసీపీ పాలనలో ఏమి జరిగిందో పోల్చుకుని మేలు జరిగితేనే తనకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సేవా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గోళ్ల సోమేశ్వరరావు, వైసిపి ఎస్సి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్, వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగు మాల కాళీ, వైసిపి జిల్లా మహిళ కార్యదర్శి మూల్పూరి హరీష, ఎంపీపీ గోగం సురేష్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి-చల్లపల్లి : టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే పేద మహిళలను ఆర్థికంగా శక్తివంతులను చేసే పథకాలు అమలులోకి వస్తాయని టీడీపీ, బీజేపీ బలపరిచిన జనసేన పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ కోడలు మండలి సాయి సుప్రియ తెలిపారు. టీడీపీ, బీజేపీ బలపరిచిన జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్, ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి ల గెలుపు కోరుతూ చల్లపల్లి పడమర వైపు ఎన్నికల ప్రచారం చేశారు. చల్లపల్లిలో రెండవ రోజు మంగళవారం ప్రచారం ముమ్మరంగా సాగింది. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. టిడిపి మండలాధ్యక్షుడు మోర్ల రాంబాబు, మాజీ మండలాధ్యక్షుడు నిడమానూరు దిలీప్, రావి చంద్రశేఖర్, మోర్ల శివ, గ్రామ సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, జనసేన మండల అధ్యక్షుడు విమల్ కష్ణ పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి-అవనిగడ్డ : నియోజకవర్గంలోని పలు మండల గ్రామాలలోని వైసీపీకి చెందిన 50 కుటుంబాలు జనసేన పార్టీలో చేరినట్లు ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి మండల బుద్ధ ప్రసాద్ తెలిపారు. మంగళవారం వైసీపీ జిల్లా కార్యదర్శి కష్ణమూర్తి, శ్రీకాకుళం, తెలుగురావు పాలెం నుంచి బుద్ధ ప్రసాద్ ఎంపీ అభ్యర్థి బాలశౌరి సోదరుడు బాల కోటేశ్వరరావు సమక్షంలో జనసేనలో చేరినట్లు తెలిపారు. వీరికి బుద్ధ ప్రసాద్ బాల కోటేశ్వరరావు పార్టీ జెండాలు కప్పి ఆహ్వానించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

- డిఎంహెచ్ఓ డాక్టర్ జి.గీతాబాయి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : చట్ట వ్యతిరేకమైన లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపడతామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ జి. గీతాబాయి హెచ్చరించారు. మంగళవారం జిల్లాలోని టాప్ స్టార్ హాస్పిటల్, కానూరు, శతి హాస్పిటల్, పామర్రు ,సిలికాన్ ఆంధ్ర హాస్పిటల్, కూచిపూడి ఆసుపత్రులను ఆకస్మికంగా సందర్శించి వైద్యశాల నిర్వహణ, అల్ట్రా సౌండ్ పరీక్షా కేంద్రాలను పరిశీలించి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ లింగ ఎంపిక నిషేధ చట్టం 1994 ప్రకారం జన్యు సంబంధ సలహా కేంద్రాలు, ప్రయోగశాలలు, అల్ట్రాసౌండ్ పరీక్షా కేంద్రాలు ,ఇమేజింగ్ కేంద్రాలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలలని, ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి తిరిగి రెన్యువల్ చేయించాలని తెలిపారు. ఆయా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి తగిన అర్హతలు ఉండాలని, తగిన ప్రమాణాలు కలిగిన పరికరాలు ,పక్కాగా రికార్డులు నిర్వహణ ఉండాలని సూచించారు. ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్లు, లాబ్లను పరీక్షించి వాటి అనుమతులను పరిశీలించారు. జిల్లాలో ఎక్కడైనా తగిన అనుమతులు లేకుండా వైద్యశాలలు ,నర్సింగ్ హోమ్ లు, పరీక్షా కేంద్రాలు గుర్తించి నట్లయితే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బడుగుల సంక్షేమానికి ప్రాధాన్యత : వంశీ

ప్రజాశక్తి-గన్నవరం : పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అబివృద్ధి కోసం సిఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డిని మళ్ళీ అధికారంలోకి తీసుకురావడం అవసరమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచేటి మురళీ అధ్వర్యంలో 470 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి వంశీమోహన్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వంశీమోహన్ మాట్లాడుతూ... భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పూర్తితో దళితుల అభ్యున్నతికి సిఎం వైఎస్. జగన్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. రాష్ట్ర ప్రజల మనస్సులను గెలుచుకున్న జగన్ ను టిడిపి ఒంటరిగా ఎదుర్కొనే దమ్ము లేక బిజెపి, జనసేనతో కూటమి కట్టిందన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తనతో పాటు మచిలీపట్నం ఎంపి అభ్యర్థి సింహాద్రి డాక్టర్ చంద్రశేఖరరావును అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎంపిపి అనగాని రవి, ఎంపిటిసి సభ్యులు తిరువీధి రవి, ఫిషరీస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల సురేష్, పార్టీ నాయకులు నిడమర్తి రామారావు, తిరువీధి రంగారావు, కలపాల డేవిడ్, వార్డు సభ్యులు నిడమర్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన వారితో ఎంఎల్ఎ వల్లభనేని వంశీ

భూహక్కు చట్టంపై దుష్ప్రచారం : సజ్జల

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై టిడిపి జనసేన దుష్ప్రచారం చేస్తున్నాయని ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం అవనిగడ్డ విచ్చేసిన ఆయన రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర రావు, కష్ణ గుంటూరు ఎన్టీఆర్ జలాల రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ కడవకొల్లు నరసింహారావుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 100 ఏళ్ల నుంచి పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు శ్రీకారం చుట్టారన్నారు. సమగ్ర భూ సర్వే పూర్తయిన తరువాత ఈ చట్టం అమలు చేపడితే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపటం సాధ్యమవుతుందన్నారు. కానీ ప్రతిపక్ష పార్టీలు నిత్యం ఈ అంశంపై ప్రజలను రెచ్చగొట్టే ప్రచారం చేస్తున్నారన్నారు.

మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి

ఈ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని సజ్జల సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జెడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ యూత్ నాయకులు సింహాద్రి వికాస్‌బాబు, మండల యూత్ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జైలు వార్డర్ ఆత్మహత్య

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ సబ్ జైల్లో జైలు వార్డరుగా పని చేస్తున్న దాసరి నాగ శివకుమార్(37) ఆత్మ హత్యకు పాల్పడ్డ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. అవనిగడ్డలో తాను నివాసం ఉంటున్న ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్సై జి రమేష్ బాబు పరిశీలించి మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. శివకుమార్ మృతిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ (బాలురు) ఉయ్యూరు, కృష్ణా జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి నూతన, బ్యాక్ లాగ్ ప్రవేశాల కొరకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి బి.ప్రకాష్ రావు ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో 40 సీట్లు నూతన ప్రవేశములు. అదేవిధంగా 4వ తరగతిలో 40 సీట్లు, 5 వ తరగతి లో 33 సీట్లు, 6వ తరగతి లో 31 సీట్లు, 7 వ తరగతిలో 13 సీట్లు, 8 వ తరగతిలో 14 సీట్లు మరియు 9వ తరగతిలో 14 సీట్లు బ్యాక్ లాగ్ ప్రవేశాలు ఉన్నాయన్నారు. రూల్ అఫ్ రిజర్వేషన్ ప్రకారంగా. (ఎస్‌టిలకు 78 శాతం, ఎస్‌సిలకు 12 శాతం, బిసి లకు 5 శాతం, ఓసి2 శాతం, ఏఇక్యూ 3 శాతం) భర్తీ చేస్తామన్నారు. ప్రవేశం కొరకు పిల్లల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్ష రూపాయలు మించి ఉండరాదన్నారు. ప్రిన్సిపాల్, గిరిజన గురుకుల బాలుర పాఠశాల, రాజేంద్రనగర్, 6 వ లైన్, ఉయ్యూరు-521165 నందు మే 20 వ తేదీ లోగా ధరఖాస్తులు చేసుకోవాలన్నారు.. ప్రవేశాలు లాటరీ పద్ధతి ద్వారా అడ్మిషన్ కమిటీ, చైర్మన్ /కన్వీనర్ /మెంబర్స్ గారి ఆధ్వర్యములో జిల్లా గిరిజన సంక్షేమ కార్యాలయము, మచిలీపట్నంలో నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు కె. కష్ణమోహన్, ప్రిన్సిపాల్ (9908839476/ 9391601861) నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వివి ఇనిస్టిట్యూట్ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సస్ కళాశాల అధ్యాపకురాలు ఏ. సాయి ధాత్రికి డాక్టరేట్ లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎలక్ష్మణరావు తెలిపారు. ఫార్మసీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న సాయి ధాత్రి ఆంధ్ర విశ్వవిద్యాలయం విశాఖపట్నం నుండి డాక్టర్ ఫిలాసఫీ డిగ్రీ అందుకున్నారు. సాయి ధాత్రి తన సిద్ధాంత వ్యాసాన్ని 'నోవల్ ఎనలిటికల్ మెథడ్స్ ఫర్ ఎస్టిమేషన్ ఆఫ్ సెలెక్టెడ్ యాంటీ హైపర్ లిపిడ మిక్ డ్రగ్స్ అనే అంశంపై సమర్పించారు. ఫార్మాస్యూటికల్ సైన్సస్ విభాగంలో విష్ణు ఫార్మసీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కెవిఎస్ నటరాజ్ పర్యవేక్షణలో పరిశోధనా గ్రంథం సమర్పించారు. ఈ పరిశోధనకు సంబంధించిన ఎన్నో వ్యాసాలను పలురకాల జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా పత్రికలలో ప్రచురించారు. ఈ సందర్భంగా అధ్యాపకురాలు ఎ సాయి ధాత్రికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. లక్ష్మణ్‌రావుతో పాటు కళాశాల చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరావు వల్లూరిపల్లి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వి సత్యనారాయణ, కో-సెక్రేటరీ అండ్ కరస్పాండెంట్ వి రామకష్ణ, అధ్యాపకులు డా. ఎస్.కె అమీనాబీ, డా. పి రవిష, డా. టి. ప్రశాంతి, డాక్టర్ టి. బాలకష్ణ, టి. శ్రావణి తదితరులు అభినందనలు తెలిపారు.

అధ్యాపకురాలు సాయిధాత్రిని అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
బుధవారం
1 మే 2024

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రతిఒక్కరు తమ ఓటు హక్కు విని యోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ఎన్నికల పరిశీలకులతో కలసి కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్లో స్పందన మీటింగ్ హాల్లో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. జిల్లాలో ఈనెల 25వ తేదీ నాటికి మొత్తం ఓటర్లు 15,39,460 కాగా వీరిలో 7,46,071 మంది పురుష ఓటర్లు కాగా, స్త్రీలు 7,93,332 మంది మహిళా ఓటర్లు, 57 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, ఎన్నికల సాధారణ పరిశీలకులు జాన్ కింగ్స్ లే, నరహరి సింగ్ బంగేర్ పాల్గొన్నారు.

ప్రసాద్ సేవలు అభినందనీయం : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖలో గత 30 సంవత్సరాలుగా వివిధ హెూదాల్లో తమ ఉత్తమ సేవలు అందించిన డిఆర్డిఏ పిడి ప్రసాద్ సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. మంగళవారం పదవి విరమణ చేసిన డిఆర్డిఏ పిడి పిఎస్ఆర్ ప్రసాద్ ను మచిలీపట్నం కలెక్టరేట్లోని స్పందన మీటింగ్ హాల్లో ఘనంగా సన్మానించి గ్రామీణాభివద్ధి శాఖలో ప్రసాద్ చేసిన సేవలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కొనియాడారు .. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె చంద్రశేఖర రావు డ్వామా పిడి జివి సూర్యనారాయణ, జడ్పీ డిప్యూటీ సీఈఓ ఆనందకుమార్ తదితర అధికారులు పిడి సేవలను ప్రశంసించి ఘనంగా సత్కరించారు.

సిపిఎం పోరాటాలతో వేల మందికి ఇళ్ల స్థలాలు

• గన్నవరం నియోజకవర్గంలో చెరగని ముద్రవేసిన ఉద్యమాలు

ప్రజాశక్తి - గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలో గత కొన్నేళ్లుగా సిపిఎం చేసిన పోరాటాల ఫలితంగా పేదలకు ఇళ్ల స్థలాలు దక్కాయి. కొత్త కాలనీలు ఏర్పడ్డాయంటే అంటే అది సిపిఎం కషి ఫలితమే. గన్నవరంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రెండు దశాబ్దాల క్రితం పేదలను కూడగట్టి ఆందోళనలు, ఉద్యమాలు చేశారు. జిల్లా కలెక్టరేట్లను అనేకసార్లు ముట్టడించారు. ఫలితంగా వెంకట నరసింహాపురంలో 1500 మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఆ తర్వాత కాలనీలో కూలిక సదుపాయాలు కల్పించి మరో ఐదేళ్ల పోరాటం చేశారు. క్రమ క్రమంగా పేదలకు ఇల్లు కట్టించారు. కొంతమంది శక్తికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నారు. కాలనీలో అభివద్ధి జరిగింది. అయితే ఇంకా రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వంటి సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఈ సమస్యల పరిష్కారం కోసం కూడా సిపిఎం ఆందోళనలు చేసింది. ఒక పెద్ద ఊరు తయారు కావడానికి సిపిఎం కషే కారణం. బుద్ధవరం రోడ్డులో, మదర్ థెరిసా కాలనీలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించిన ఘనత సిపిఎందే. కొన్నేళ్లపాటు పోరాటం చేసి అందరికీ ఇళ్ల స్థల పట్టాలు మంజూరు చేయించారు.

అలాగే కేసరపల్లి సుందరయ్య కాలనీ ఏర్పాటు వెనుకా సిపిఎం పోరాటాలు ఉన్నాయి. ఆ గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పదేళ్లపాటు పోరాటం జరిగింది. అప్పట్లో ప్రభుత్వం స్పందించకపోవడంతో సిపిఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేయించారు. దీంతో ప్రభుత్వం దిగివచ్చి సుందరయ్య కాలనీ ఏర్పాటు చేసి 200 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చింది. అదేవిధంగా ఐటి పార్కు వెనుక పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంలోనూ కషి జరిగింది. బుద్ధవరం పంచాయతీ పరిధిలో రాజీవ్‌కాలనీ, రమణమ్మ చెరువు, విమానాశ్రయ నిర్వాసితులకు స్థలాలు ఇప్పించగలిగారు. కమ్యూనిస్టులు నిలబడి నెలల తరబడి ఉద్యమాలు చేశారు. అనేకసార్లు అరెస్టయి జైలుకు వెళ్లారు. అంతిమంగా పేదలకు 400 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అందులో ఇళ్లను నిర్మించుకుని సొంతింటి కలను నిజం చేసుకున్నారు పేదలు. మౌలిక సదుపాయాల కల్పనకు బుద్ధవరం పంచాయతీ చర్యలు తీసుకుంది. ఇందులో కమ్యూనిస్టు ఉద్యమ నాయకులు చింతపల్లి లక్ష్మారాయుడు సహకారం ఉంది. అదేవిధంగా మండలంలోని ముస్తాబాద కొండగట్టు చుట్టూ పేదలు ఇళ్లు నిర్మించుకోవడంలో సిపిఎం చేయూత ఉంది. ఎన్నిసార్లు అర్జీలు పెట్టిన అధికారులు, పాలకులు స్పందించకపోవడంతో పేదలను సమీకరించి గుడిసెలు వేయించింది. ఆ తర్వాత క్రమంగా ఇళ నిర్మాణం చేసుకునేలా చేసింది. పట్టాల కోసం పదేళ్లుగా ఆందోళనలు జరుగుతున్నాయి. దళితులు పేదల పక్షాన నిలబడి ఎర్రజెండా ఉద్యమించింది. సూరంపల్లి, కొండపావులూరు, పురుషోత్తపట్నం, బిబి గూడెం, గొల్లనపల్లి ప్రాంతాల్లోనూ ఇళ్ల స్థలాల సాధనకు కషి జరిగింది. 500 మందికి ఇళ్ల స్థలాలు వచ్చాయి. వీరపనేనిగూడెం గ్రామంలో కొండగట్టుపై 300 మందితో సిపిఎం నేతలు గుడిసెలు వేయించి వారందరికీ పట్టాలు వచ్చేలా చేశారు. ఎర్ర జెండాలు చేత పూని పేదలంతా కదిలారు. కొండగట్టుపై అందరికీ పట్టాలు ఇప్పించి కాలనీ నిర్మాణం చేయించారు. ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామంలో దళితులకు, బలహీనవర్గాల వారికి ఇళ్ల స్థలాలు కోసం కొన్నేళ్లపాటు పోరాటం జరిగింది. బొగ్గుపేట దళితవాడ ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. మానికొండ, ఇందుపల్లి, ఉంగుటూరు, ఆత్కూరు, పెద అవుటపల్లి గ్రామాల్లోనూ ఎర్ర జెండా చేసిన ఉద్యమాల ఫలితంగా పేదలకు ఇళ్ల స్థలాలు వచ్చాయి. బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్ల స్థలాల కోసం నిరంతరం ఉద్యమాలు సాగాయి. అనేక గ్రామాల్లో కొత్త కాలనీలు ఏర్పాటయ్యాయి. ఇళ్ల స్థలాలు ఇప్పించడం, కాలనీలో ఇళ్ల నిర్మాణం చేయించడమే కాకుండా మౌలిక సదుపాయాలు కల్పన కోసం పేదల పక్షాన నిలబడి ఎర్ర జెండా ఉద్యమాలు సాగిస్తోంది. విజయవాడ రూరల్ మండలంలో అనేక పోరాటాలు జరిగాయి. ఏలూరు కాల్వకట్టపై పేదల ఇళ్లు తొలగించడానికి ప్రభుత్వాలు ప్రయత్నించగా, ఎర్రజెండా అడ్డంగా నిలబడి వారి పక్షాన పోరాటం సాగించింది. ఫలితంగానే పేదల ఇళ్లు నిలబడ్డాయి. అదేవిధంగా ఏలూరు కాల్వ మళ్లింపు సమయంలో ప్రభుత్వ వైఖరికి నిరసనగా పెద్దఎత్తున ఉద్యమం సాగింది. ప్రభుత్వం దిగువచ్చి ఏలూరు కాల్వ మళ్లింపును నిలుపుదల చేసింది. పోలవరం కాల్వ తవ్వకం సమయంలో భూములు తీసుకున్న రైతులకు న్యాయమైన పరిహారం కోసం ఎర్రజెండా సమరశీల పోరాటం చేసింది. రైతులకు న్యాయమైన ధర ఇచ్చే వరకు ఉద్యమిస్తూనే ఉంది. మూడు నెలలు సాగిన ఈ పోరాట ఫలితంగా ఎంతో మంది రైతులకు న్యాయమైన పరిహారం వచ్చింది. పేదలకు, రైతులకు, కూలీలకు ఎర్రజెండా ఎప్పుడు అండగా నిలబడుతోందనేది అక్షర సత్యం.

ప్రజల పక్షాన నిలిచే వారిని ఎన్నుకోండి

- సిపిఎం, కాంగ్రెస్, సిపిఐ రోడ్ షోలో నేతలు
- 'సెంట్రల్'లో ఇండియా వేదిక బలపరచిన ఎంపి అభ్యర్థి భార్గవ్, ఎంఎల్ఎ అభ్యర్థి బాబూరావు బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-విజయవాడ, అజిత్‌సింగ్‌నగర్ : నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజల పక్షాన నిలిచే అభ్యర్థులను ఎన్నికల్లో ఎన్నుకోవాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఇండియా వేదిక బలపరిచిన విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి చిగురుపాటి బాబూరావు, విజయవాడ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వల్లూరు భార్గవ్ విజయాన్ని కాంక్షిస్తూ సిపిఎం, కాంగ్రెస్, సిపిఐ, ఆర్‌జెడి, ఆమ్‌ఆద్మీ పార్టీల నేతృత్వంలో మంగళవారం ఉదయం కండ్రిక బస్టాండ్ నుంచి సత్యానారాయణపురం వరకు, సాయంత్రం అల్లూరి సీతారామరాజు బ్రిడ్జి సెంటర్ నుంచి దుర్గాపురం, గాంధీనగర్, అరండల్‌పేట, కారల్‌మార్క్స్ రోడ్డు, సూర్యారావుపేట, ఎంజి రోడ్డు, హనుమాన్‌పేట, పాత ఆర్టీసి బస్‌స్టేషన్ వరకు బైక్ ర్యాలీలు నిర్వహించారు. అభ్యర్థులు ప్రత్యేక వాహనంలో నిలబడి ప్రజలకు అభివాదం తెలుపుతూ ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. ఇండియా వేదిక అభ్యర్థులైన సిపిఎం, కాంగ్రెస్, సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని, కేంద్రంలోని బిజెపి దానికి మద్దతు నిస్తున్న టిడిపి, జనసేన, పరోక్షంగా మద్దతునిస్తున్న వైసిపిలను చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో సిపిఎం అభ్యర్థి చిగురుపాటి బాబూ రావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపికి లొంగిపోయే పార్టీలకు ఓటు వేస్తే ఆ ఓటు వృధా అవుతుందని పేర్కొన్నారు. కేంద్రంపై దమ్ము, ధైర్యంతో పోరాడే సిపిఎం, కాంగ్రెస్, సిపిఐ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. భూదందాలు, భూకబ్జాలు, అవినీతి అక్రమాలు చేసే అభ్యర్థులను మట్టికరిపించి, ప్రజల కోసం నిరంతరం పోరాడే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. విజయవాడ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వల్లూరు భార్గవ్ మాట్లాడుతూ ఎంతో చైతన్యం కల్గిన విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ మాట్లాడుతూ ఇండియా వేదిక అభ్యర్థులైన బాబూరావు, వల్లూరు భార్గవ్‌ను గెలిపించినట్లైతే నగరాన్ని అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కాంగ్రెస్ నాయకులు కొలనుకొండ శివాజీ, నరహరిశెట్టి నరసింహారావు, గురునాథం, సిపిఐ నాయకులు భాస్కరరావు, ఆర్‌జెడి నాయకులు ప్రవీణ్, సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె శ్రీదేవి, ఆంధ్ర మాల్యాద్రి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, కోటా కళ్యాణ్, నాయకులు కె దుర్గారావు, ఎన్‌సిహెచ్ సుప్రజ, టి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న వల్లూరు భార్గవ్, సిహెచ్ బాబురావు

ప్రజాప్రతినిధిగా ఎలా ఉండాలో చూపిన సుందరయ్య

నేడు 111వ జయంతి సందర్భంగా

ఒక శాసనసభ్యునిగా ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి, గ్రామసీమల బాగోగులు చూడటానికి సైకిల్ మీద పర్యటించిన వ్యక్తి బహుశా భారతదేశంలో పుచ్చలపల్లి సుందరయ్యగారే. గన్నవరం నియోజకవర్గంలో అన్ని గ్రామాలలోనూ సుందరయ్యగారికి సంబంధాలు ఉండేవి. ప్రతి ఆరునెలల కొకసారి ఆయన నియోజకవర్గాన్ని చుట్టి వచ్చేవారు. గ్రామానికి గ్రామానికి మధ్య సైకిళ్ల ప్రయాణం. సైకిల్ ప్రయాణం వల్ల ఎక్కువమంది జనాన్ని కలిసే అవకాశం వుండేది. కొన్ని గ్రామాలకయితే సైకిల్ వెళ్లడానికి సైతం రోడ్లు వుండేవి కావు. చిక్కవరం నుండి చింతగుంట వెళ్లడానికి రోడ్డు లేదు. సైకిల్ కూడా వెళ్లదు. ఆ రెండు కిలోమీటర్ల దూరం సుందరయ్యగారితో నడిచి వెళ్లేవాళ్లం. ఆయన నడక చాలా వేగం. పరుగులాంటి నడకతో ఆయనను అందుకొనేవాళ్లం. నేను సమితి అధ్యక్షునిగా ఉన్నప్పుడు సుందరయ్యగారు శాసనసభ్యుడిగా కొంతకాలమే పనిచేశారు. ఆ సందర్భంలో 'చిక్కవరం – చింతగుంట' రోడ్డును వేయించి స్వాతంత్ర్యానంతరం ఆ గ్రామానికి మొటఎమొదటిసారిగా ప్రజల రాకపోకలకు వీలు కల్పించాము.

గ్రామాలకు వెళ్లి తరువాత సుందరయ్యగారు మొదటగా గ్రామసభలు ఏర్పాటు చేసేవారు. అక్కడ వారి సమస్యలడిగి డైరీలో నోట్ చేసుకునేవారు. సభ ముగిసేముందు సమస్యల లిస్ట్ చదివి ఏ సమస్యకు ముందు ప్రాధాన్యత ఇవ్వాలి. ఏ పని తరువాత చేయాలి అనేవి చెప్పేవారు. ఆయన ఏ గ్రామానికి వెళ్లినా ప్రప్రథమంగా తాగునీటి సమస్యకు ప్రాధాన్యత ఇచ్చేవారు. ఆ తరువాత పాంవశాల, రోడ్లు మొదలైన వాటికి ప్రాధాన్యత ఇచ్చేవారు.

శాసనసభ ఎన్నికల సందర్భంలో ఆయన ప్రతి వీధిని వదిలిపెటఎకుండా ప్రజలను కలిసి వెళ్లేవారు. క్యాడర్ అంటే అభిమానం, ప్రజలతో సంబంధాలు బాగా వుండేవి కనుకనే ఏ నాయకునికీ ఇవ్వని గౌరవం సుందరయ్యగారికి ఇచ్చేవారు. రాజకీయాలతో నిమిత్తం లేకుండా ప్రజల్ని ఆప్యాయంగా పలుకరించేవారు. క్యాడర్‌కు పనికొచ్చే స్వభావం వుంటే బాగా రిలేషన్ పెటుఎకునే పద్ధతి సుందరయ్యగారికుంది.

నేను ఆత్కూరు గ్రామానికి సర్పంచ్‌గా ఉన్నప్పుడు సుందరయ్యగారికి సన్మానం చేయాలనుకున్నాం. ఆయన సన్మానాలను ఒప్పుకునేవారు కాదు. నా మాటను కాదనలేక అంగీకరించారు. ఆ రోజుల్లో మా గ్రామంలో ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్లలో జనాలకు పనులుండేవి కావు. గ్రామంలో పనుల్లేక పూటగడవని వాళ్లందర్నీ లెక్కించి భోజన కేంద్రాలు నడిపాం. వారికక్కడ భోజనాలు పెట్టేవాళ్లం. ఒకసారి సుందరయ్యగారు వచ్చి ఈ కార్యక్రమం చూశారు. ఇంటికి వచ్చిన తరువాత నన్ను తీవ్రంగా మందలించారు. నువ్వు విప్లవకారులను తయారు చేస్తున్నావా? లేక అడుక్కు తినేవారిగా తయారు చేస్తున్నావా అని ఆగ్రహించారు. ఇదేమిటి ఇంత మంచిపని చేస్తే ఈయన కోపగించుకుంటున్నారేమిటని నేను అనుకునేవాణ్ణి. ఇలాంటి చర్య వల్ల తానొక మనిషినన్న భావం, పోరాడి సాధించుకోవాలన్న లక్ష్యం అతనికి ఎలా ఏర్పడుతుంది. వర్గ పోరాట తత్వాన్ని, ఘర్షణను ప్రేరేపించి వారిని మానసికంగా తయారుచేయాలే తప్ప ఇలాంటి భోజన కేంద్రాల వల్ల జనం సంఘటితం కారని సుందరయ్యగారు చెప్పేవారు.

1970 తరువాత గన్నవరం డివిజన్‌లో బ్రహ్మాండమైన ప్రజా పోరాటాలు జరిగాయి. ఆరుగొలను భూస్వామికి 200 ఎకరాల పొలం ఉంది. జనాన్ని బండ బూతులు తిడుతుండేవాడు. కూలికి రాకపోతే చేయి చేసుకునే స్వభావం కూడా ఆయనకుంది. ఈ సంగతి నాకు తెలియడంతో ఆరుగొలను వెళ్లి పేదలను సమీకరించి బ్రహ్మాండమైన ప్రదర్శన చేసి, భూస్వామి ఇంటి ముందు ధర్నా చేశాం. ఆయన దిగివచ్చి క్షమాపణ చెప్పాడు. ఆ రోజుల్లో పేదలపై దౌర్జన్యాలు చేయడానికి పెత్తందార్లు దడిసేవారు. ఇది సుందరయ్యగారు నేర్పిన వర్గ పోరాట వాద పదును వల్లేనే సాధ్యమయింది. గన్నవరం డివిజన్‌లో కూలి పోరాటాలు ఉధృతంగా నిర్వహించామన్నా, 35 గ్రామాలలో డిపోలు పెట్టి కిలో బియ్యం రూపాయికే అమ్మించామన్నా అవన్నీ సుందరయ్యగారి నుండి మేము స్ఫూర్తి పొందడం వల్లనే. ఒక దశలో అత్యంత సమరశీల పోరాటానికి గన్నవరం పార్టీ సిద్ధమైందంటే అది సుందరయ్యగారి వర్గ పోరాట స్ఫూర్తేనని కచ్చితంగా చెప్పగలను. 1978లో సుందరయ్యగారు గన్నవరంలో బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిచారంటే ఇక్కడ ప్రజల్లో ఆయనకున్న స్థానం ఎలాంటిదో విదితమవుతుంది.

- కీ॥శే॥ అట్లూరి శ్రీమన్నారాయణ
సిపిఎం సీనియర్ నాయకులు
గన్నవరం పంచాయతీ సమితి మాజీ అధ్యక్షులు

ప్రచారంలో మాట్లాడుతున్న యార్లగడ్డ వెంకట్రావు

యార్లగడ్డ వెంకట్రావు ప్రచారం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలంలోని గోపవరపు గూడెం, కట్టుబడిపాలెం, కొండ పావులూరు, పురుషోత్తపట్నం గ్రామాల్లో మంగళవారం గన్నవరం నియోజకవర్గ టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకటరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జాస్తి వెంకటేశ్వరరావు, మండవ లక్ష్మి, వెంకటరత్నం పాల్గొన్నారు.

గన్నవరం నుంచి 12 మంది అభ్యర్థులు పోటీ

ప్రజాశక్తి-గన్నవరం : గన్న వరం అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో తలపడేందుకు 12 మంది మిగిలారు. సిపిఎం నుంచి కళ్ళం వెంకటేశ్వరరావు, గుర్తు సుత్తి కొడవలి నక్షత్రం, టిడిపి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు గుర్తు సైకిల్, వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీ మోహన్ గుర్తు ఫ్యాను. వీరు ముగ్గురు ప్రధాన అభ్యర్థులుగా ఉన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు మొత్తం 24 మంది నామినేషన్లను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వాటిలో వివిధ కారణాలతో 10 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆర్వో జేసీ గీతాంజలిశర్మ నేతత్వంలోని ఎన్నికల అధికారులు తిరస్కరించారు. పరిశీలన అనంతరం బరిలో ఉన్న 14మంది అభ్యర్థుల్లో అజయ్ పైలా (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), సింహాద్రి రాఘవేంద్రరావు(బి.ఎస్.పి)లు తమ నామినేషన్లను ఉపసం హరించుకున్నారు. దీంతో ప్రస్తుతం గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ బరిలో 12 మంది ఉన్నట్లు రిటర్నింగ్ అధికారిణి గీతాంజలిశర్మ పేర్కొన్నారు. ప్రధాన అభ్యర్థులు ముగ్గురుతో సహా మరో 9 మంది రాజకీయ పార్టీ, స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరికి కూడా సింబల్స్ కేటాయించారు. ఇండిపెండెంట్ అభ్యర్థి వల్లభనేని కష్ణవంశీకి గాజు గ్లాసు ఇచ్చారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వి.శ్రీనివాసరావు

దేశ శ్రేయస్సు కోసం బిజెపి, టిడిపి, వైసిపిలను ఓడించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- కాంగ్రెస్, సిపిఎం అభ్యర్థులు కృష్ణ, కళ్లం ప్రచారం

ప్రజాశక్తి-గన్నవరం : దేశాన్ని అన్ని విధాలుగా నాశనం చేస్తున్న బిజెపి, దానికి మద్దతు పలుకుతున్న వైసీపీ, టీడీపీలను ఓడించడమే ప్రజల ముందు ఉన్న తక్షణ కర్తవ్యం అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో, దేశంలో రాజకీయ వ్యాపారస్తులకు, రాజకీయాలను నమ్ముకున్న వారికి మధ్య పోటీ జరుగుతుందన్నారు. ప్రజల కోసం పనిచేసే ఇండియా వేదిక, ఎర్రజెండా పార్టీలను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇండియా వేదిక బలపరచిన సిపిఎం గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కళ్ళం వెంకటేశ్వరరావు, మచిలీపట్నం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గొల్లు కృష్ణ మంగళవారం విజయవాడ రూరల్ మండలం నున్నలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ మరోసారి బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని, లౌకికవాదం, ప్రజాస్వామ్యం గొంతు నులుముతారని ఆందోళన వ్యక్తం చేశార. ఒకే దేశం, ఒకే నాయకుడు అనేది మోదీ నినాదం అన్నారు. ఈ దేశాన్ని కార్పొరేట్ శక్తులపరం చేయడానికి శక్తి వంచన లేకుండా మోదీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తెలుగుదేశం, జనసేన పార్టీలు బిజెపితో జతకట్టడమంటే రాష్ట్రంలోని కోట్లాది మంది ప్రజలను మోసం చేయడమే అవుతుందన్నారు. డబ్బు సంచులతో గెలిచిన వారు ప్రజా సమస్యలను పట్టించుకోర న్నారు. నీతివంతమైన రాజకీయాల కోసం ప్రజల మధ్యలో ఉండి వారి సమస్యలు తెలుసుకుని చట్టసభలో చర్చించి పరిష్కరించే వారికి అవకాశం ఇవ్వాలని కోరారు. మచిలీపట్నం పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి గొల్లు కృష్ణ మాట్లాడుతూ.. ఇండియా వేదిక అధికారంలోకి వస్తేనే దేశం మనుగడ సాధిస్తుందన్నారు. సిపిఎం అభ్యర్థి కళ్ళం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ..కాంగ్రెస్, సీపీఎం, ఆమ్ ఆద్మీ పార్టీలు బలపర్చిన తనను గెలిపిస్తే రాష్ట్ర ప్రజాయోజనాలు, గన్నవరం నియోజకవర్గ అభివద్ధి కోసం పని చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు, పార్టీ నాయకులు ఎం హరిబాబు, ఆంజనేయులు, రంగారెడ్డి, వెంకటరెడ్డి, పాల్గొన్నారు. అదేవిధంగా డప్పు కళాకారులు గ్రామంలో డప్పు వాయిస్తూ పాడిన పాటలు ప్రజలను ఆలోచింపజేశాయి. ఎర్ర జెండాకు ఓట్లు వేయాలని గీతాలపన చేశారు.

858 సి-విజిల్ ఫిర్యాదుల పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ : జిల్లా లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు సీ-విజిల్ ద్వారా 863 ఫిర్యాదులురాగా 858 ఫిర్యాదుల పరిష్కారం పూర్తయిందని.. మిగిలినవి పురోగతిలో ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీ రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ) తదితర మార్గాల ద్వారా మొత్తం 2,161 ఫిర్యాదులు రాగా 2,130 ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ పూర్తయిందని, మిగిలినవి పురోగతిలో ఉన్నాయని వివరించారు. ఓటరు హెల్ప్‌లైన్ (1950) ద్వారా 407 ఫిర్యాదులు రాగా 407 ఫిర్యాదుల పరిష్కారం పూర్తయిందన్నారు. ఎన్‌జీఎస్పీ ద్వారా 648 ఫిర్యాదులు రాగా 639 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. అదే విధంగా వాట్సాప్ నంబరు (9154970454) ద్వారా 41 ఫిర్యాదులు రాగా 41 ఫిర్యాదులు, కాల్ సెంటర్ (0866-2570051) ద్వారా 25 ఫిర్యాదులు రాగా 25 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎంఎస్) ద్వారా 85 ఫిర్యాదులు రాగా 73 ఫిర్యాదులను, సీఈవో మెయిల్స్ ద్వారా 16 ఫిర్యా దులు రాగా 13 ఫిర్యాదులను పరిష్కరించి నట్లు తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో మీడియా మానిటరింగ్ ద్వారా 76 అంశాలకు సంబం ధించి 74 అంశాలను పరిష్కరించినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

సజావుగా ఓటర్ స్లిప్పులు పంపిణీ : జెసి

ప్రజాశక్తి-విజయవాడ : సాధారణ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు జిల్లా ఎన్నికల విభాగం అధికారులు విస్తతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ముందస్తుగా ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్ (వీఐఎస్)లను ముమ్మరంగా, సజావుగా పంపిణీ చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్ తెలిపారు. మంగళవారం విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధి, బందర్ రోడ్డులోని స్థానిక జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో డా. పి. సంపత్ కుమార్‌కు బీఎల్వో వీఐఎస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల విభాగం అధికారులు విస్తతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ముందస్తుగా ఇంటింటికీ వీఐఎస్‌లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటింగ్ శాతం పెంచాలనే లక్ష్యంతో వినూత్నంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ తెలిపారు.

వైసిపితోనే అభివృద్ధి సాధ్యం : సింహాద్రి

ప్రజాశక్తి-చల్లపల్లి : గ్రామీణ అభివృద్ధి, రాష్ట్ర ప్రగతి వైసీపీతోనే సాధ్యమని వైసీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, అవనిగడ్డ శాసనసభ్యులు, అవనిగడ్డ నియోజకవర్గ అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మంగళవారం సాయంత్రం చల్లపల్లిలో వైసీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర రావు, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్ బాబు, వైసీపీ రైతు విభాగం ఉమ్మడి కష్ణా గుంటూరు జిల్లాల జోనల్ ఇంచార్జి కడవకొల్లు నరసింహారావు, ఎమ్మెల్యే సింహాద్ తనయుడు సింహాద్రి వికాస్ బాబు, కడవకొల్లు నరసింహారావు తనయుడు కడవకొల్లు చైతన్య ఎన్నికల ప్రచారం చేశారు. పడమర వైపు నుంచి బస్టాండ్ సెంటర్, ప్రధాన కూడలి మీదుగా ఎస్.ఆర్.వై.ఎస్.పీ హైస్కూల్ వరకూ దుకాణదారులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో వేలాది మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న సింహాద్రి రమేష్‌బాబు

కాంగ్రెస్ గెలుపు ద్వారానే అభివృద్ధి

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : ఇండియా వేదిక సిపిఐ, సిపిఎం బలపరిచిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అబ్దుల్ మతీన్ మంగళవారం స్థానిక గడ్డి బజార్, ఇంకుదురుపేట తదితర ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ మతీన్ మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం ఎక్కువైపోయిందని 30 లక్షల ఉద్యోగాలు నియామకానికి రాహుల్ గాంధీ తొలి సంతకంతో భర్తీ చేస్తారని అన్నారు. ప్రత్యేక హెూదా, పోలవరం పూర్తి, అమరావతి నిర్మాణం వంటి ఏ కార్యక్రమం చేయాలన్నా అది జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని అన్నారు. సిపిఎం నాయకులు బూర సుబ్రహ్మణ్యం, కొడాలి శర్మ ,సిహెచ్ రాజేష్ ,సిపిఐ నేతలు లింగం ఫిలిప్, మోదుమూడి రామారావు, కాంగ్రెస్ నేతలు నలబోలు కుమారి, పేరిశెట్టి నాగరాజు, నూరుద్దీన్, మహమ్మద్ ఆరిఫ్ ,డాక్టర్ గౌస్ మొహిద్దిన్, సామ్యూల్ పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపు తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - కంచికచర్ల : గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో మంగళవారం సమ్మర్ క్యాంపు తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ 114వ జయంతిని పురస్కరించుకొని సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు తెలుగు మాస్టర్ యెస్.కె ఇస్మాయిల్ సాహిత్య రంగంలో శ్రీ శ్రీ చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. తెలుగు సాహిత్యం, చలనచిత్రాల్లో తన రచనలకు ప్రసిద్ధి చెందిన భారతీయ కవి, గేయ రచయిత, మహా ప్రస్థానం అనే సంకలనానికి ప్రసిద్ధి చెందిన శ్రీశ్రీ జాతీయ చలనచిత్ర పురస్కారం, నంది అవార్డు, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు డ్రాయింగ్ మాస్టర్ సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ ఆరో వార్డుకు చెందిన వాలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేశారు. మంగళవారం సచివాలయంలో అధికారులకు రాజీనామా పత్రాలు అందజేశారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి ఏ.రవీంద్రరావు గాంధీ సెంటర్‌లో ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం నియోజకవర్గాలకు సంబంధించిన జనరల్ అబ్జర్వర్ నరేందర్ సింగ్ బాలి ఐఎఎస్ ముఖ్య అతిథిగా స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ కార్యక్రమం ద్వారా అన్ని వర్గాల ఓటర్లు పెద్దఎత్తున ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములను చేసేందుకు భారత ఎన్నికల సంఘం చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా కొనియాడారు.

ర్యాలీతో ఓటర్లకు అవగాహన

పెనుగంచిప్రోలు : మండల కేంద్రంలో మంగళవారం జగ్గయ్యపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సెంటర్ నుండి గ్రామ ప్రధాన రహదారి మీదుగా పుర వీధుల్లో అధికారులు, నూతన యువ ఓటర్లు ర్యాలీగా బయలుదేరి పోలీస్ స్టేషన్ సెంటర్ చేరుకుని అక్కడ యువ మహిళా ఓటర్లు, కొత్త ఓటర్లతో మానవ హారం నిర్వహించారు. ఈ ర్యాలీలో ముక్త్యాల, నందిగామ, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజక వర్గాల సాధారణ పరిశీలకులు నరేందర్ సింగ్ బాలి పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రోత్సహించారు. అధిక ఓటింగ్ శాతాన్ని నమోదు చేయడం ద్వారా ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. కొత్త ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యువ ఓటర్లు ప్రదర్శించిన నృత్యాలు, పాటలు పలువురిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు, స్వీప్ నోడల్ అధికారి యు.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్షర మాలగా కూర్చున్న మహిళలు

అక్షర మాలతో అవగాహన

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ఆర్‌డిఒ కార్యాలయం ఆవరణలో మంగళవారం సాయంత్రం రిటర్నింగ్ అధికారి మాధవి ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కల్పిస్తూ వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ఓటు మన హక్కు, ఓటు వేద్దాం మే 13 అనే నినాదం రూపకల్పనతో మహిళలు అక్షర రూపంలో కూర్చున్నారు. నాలుగు మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, ఆరోగ్య కార్యకర్తలు, డ్వాక్రా, మెప్మా మహిళలు, సచివాలయాల ఉద్యోగులు ఈ అక్షర రూపంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాధవి మాట్లాడుతూ ఓటు అనేది ఎంతో విలువైనదని, దాని ద్వారానే మంచిచేసే ప్రభుత్వాలను ఎన్నుకునే అవకాశం ఉంటుందన్నారు.

ముమ్మరంగా ప్రచారం

ఆలోచించి అభివృద్ధికి ఓటు వేయండి

:ఎమ్మెల్యే జగన్ మోహన్ రావు

ప్రజాశక్తి- నందిగామ : పట్టణంలోని మెయిన్ బజార్ 19వ వార్డులో వైసిపి శ్రేణులతో కలిసి.. ప్రతి గడపకు తిరుగుతూ, ఎన్నికల ప్రచారం ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ పాలనలో ఎమ్మెల్యేగా తన ఐదేళ్ల పదవీకాలంలో నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశా, ముఖ్యంగా గత నందిగామను - ప్రస్తుత నందిగామను పోల్చుకుంటే ఎంత అభివృద్ధి జరిగిందో స్పష్టంగా కనబడుతుందన్నారు.

తంగిరాల సౌమ్య ప్రచారం

'నేటి అవసరాలు తీరుస్తాం... రేపటి ఆకాంక్షలు సాకారం చేస్తాం' అనే నినాదంతో ఎన్డీయే కూటమి ఉమ్మడి అభ్యర్థి తంగిరాల సౌమ్య ప్రచారం నిర్వహించారు. మూడు పార్టీలకు ప్రజలు, వివిధ వర్గాల నుంచి వచ్చిన వినతులు, అగ్ర నేతల ఆలోచనలు, వివిధ సందర్భాల్లో ఇచ్చిన హామీల కలబోతగా మేనిఫెస్టో ఉంటుందన్నారు. మంగళవారం నందిగామ పట్టణం 4,5,6 వార్డుల్లో ఇంటింటికీ విస్తృత పర్యటన చేపట్టారు. సూపర్ సిక్స్ పథకాల అమలు గురించి వివరించి ఓట్లను అభ్యర్థించారు.

మోసం చేయడం చంద్రబాబు అలవాటే

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : చంద్రబాబు బూటకపు హామీలను నమ్మవద్దని వైసిపికి మీ విలువైన ఓటు వేసి ఆశీర్వదించాలని విమలభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలభాను అన్నారు. పట్టణంలోని 31వ వార్డు శాంతినగర్, టీచర్స్ కాలనీలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ, ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలను తెలియపరుస్తూ ఉదయభాను సతీమణి సామినేని విమలభాను, సోదరీమణులు జయశ్రీ, బేబీ, వారి కుమార్తె పద్మ ప్రియాంక ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మే 13న జరిగే ఎన్నికల్లో ఎంపీగా కేశినేని నాని ని, ఎమ్మెల్యేగా సామినేని ఉదయభాను ని మరొకసారి గెలిపించాలని ప్రజలను కోరారు.

'ఎమ్మెల్యే ఉదయభాను గెలిపించటమే లక్ష్యం'

జగ్గయ్యపేట నియోజకవర్గంలో జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే ఉదయభాను గెలిపించడమే ప్రధాన లక్ష్యంగా 24 గంటల పని చేస్తానని, వైసిపి రాష్ట్ర నాయకులు కరిసే మధు అన్నారు. పట్టణంలోని తొరగుంట పాలెంలో పలువురిని కలిసి ఉదయభానుకు ఓటేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట పట్టణ 8వ వార్డ్ కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, పలువురు నాయకులు, పలు ప్రజాసంఘాల వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల్ని మహాశక్తిగా తీర్చిదిద్దే బాధ్యత కూటమిదే

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : రాష్ట్రంలో మహిళల్ని మహాశక్తిగా తీర్చిదిద్దే బాధ్యత రాబోతున్న తెలుగుదేశం ప్రభుత్వానిదే అని, టిడిపి, జనసేన, బిజెపి పార్టీల నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య సతీమణి శ్రీరాం శ్రీదేవి అమ్మాజీ అన్నారు.జగ్గయ్యపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తోన్న తన భర్త శ్రీరాం రాజగోపాల్ తాతయ్యకు మద్దతుగా ఆమె ప్రచారం చేశారు. మంగళవారం రాత్రి పట్టణంలోని 1వ వార్డు సిద్ధార్థ నగర్ మరియు డాంగే నగర్ నందు విస్తృతంగా ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

ఇంటింటా టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - గంపలగూడెం : స్థానిక టౌన్ పరిధిలో టిడిపి నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ప్రధాన వీధిలో నిర్వహించిన, ఈ కార్యక్రమంలో సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఓటర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆ పథకాల విషయమై వివరించారు. టౌన్ పార్టీ అధ్యక్షుడు కాజా రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని నాగులూరు గ్రామ శివారు శాయన్నపాలెం గ్రామంలో టిడిపి మైలవరం నియోజకవర్గ అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాదు, పార్లమెంటు అభ్యర్థి కేశినేని శివనాథ్ విజయం కోసం ఆ పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు.

నందిగామలో కాంగ్రెస్ అభ్యర్థి మందా వజ్రయ్య ప్రచారం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామలో సిపిఎం, సిపిఐ బలపరచిన కాంగ్రెస్ అభ్యర్థి మందా వజ్రయ్య మంగళవారం నందిగామ బార్ అసోసియేషన్ ప్రాంగణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమ అమూల్యమైన ఓటు హస్తము గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్ల గట్ల స్వామిదాస్‌ను గెలిపించి ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు వేసుకోవాలని ఆయన సతీమణి సుధారాణి పేర్కొన్నారు. తిరువూరు మండలం వావిలాల గ్రామంలో ఆమె మంగళవారం వైసిపి నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జగన్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో రాజకీయాలకతీతంగా అమలు జరగాలంటే మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమవుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బండారు పద్మావతి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారంజక పాలకుడు జగన్

ఎన్నికల ప్రచారంలో ఎంపీ కేశినేని నాని

ప్రజాశక్తి - భవానీపురం : ఇచ్చిన హామీలు కంటే ఎక్కువగా అభివృద్ధి సంక్షేమం అందిస్తున్నటువంటి వ్యక్తి. ప్రజా పాలకుడు సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి అని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) కొనియాడారు. మంగళవారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 41వ డివిజన్ స్థానిక కార్పొరేటర్ ఎండీ.ఇర్ఫాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు ఎన్నికల ప్రచారంలో భాగంగా విజయవాడ వైసిపి పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌తో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కేశినేని నాని మీడియాతో మాట్లాడుతూ అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తి చంద్రబాబు నాయుడు అంటూ ధ్వజమెత్తారు. ప్రజలకు మంచి చేసే విషయంలో ఫెయిల్ అయిన చంద్రబాబు ఇవాళ మళ్లీ కూటమిలో భాగంగా అధికారం కోసం 6,500 హామీలిచ్చి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్. బండి నాగేంద్ర పుణ్యశీల, జిల్లా గ్రంథాలయ సంస్థచైర్మన్ జమల పూర్ణమ్మ, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఎన్టీఆర్ జిల్లావక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం

జగ్గయ్యపేటలో ఉదయభాను ప్రచారం

నందిగామలో టిడిపి అభ్యర్థి సౌమ్య ప్రచారం

వన్‌టౌన్‌లో ఆసిఫ్, నాని ప్రచారం

ప్రజాశక్తి - వత్సవాయి : ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి కర్నాటి అప్పారావు ప్రచారం నిర్వహించారు. మండలంలోని గోపినేనిపాలెం, మంగొల్లు, దేశపాలెం పెద మోదుగుపల్లి, చిన్న మోదుగుపల్లి, రామచంద్రపురం, ఇందుకుపల్లి, కన్నెవేడు, చిట్యాల, సింగవరం, భీమవరం, మక్కపేట, తదితర గ్రామాల్లో ప్రచార యాత్ర కార్యక్రమం చేపట్టారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి, వైసిపి దేశ అభివృద్ధికి రాష్ట్ర అభివృద్ధికి ఏమి లేదని అంతా శూన్యమే అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మరలా దేశ ఆర్థిక అభివృద్ధి చెందుతుందని ప్రాజెక్టులు పూర్వవైభవమని అన్నారు. పోలంపల్లి మునేరి డ్యాము నిర్మాణం చేపట్టి 20 సంవత్సరాలు పూర్తవుతున్న నేటికీ కూడా అసంపూర్తిగా మిగిలిపోయిందని ఆయ కట్టు రైతులు పంటలు పండగ నీరు అందక ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులను ఓడించి, సిపిఐ సిపిఎం బలపరిచిన ఇండియా వేదిక ఎమ్మెల్యే, ఎంపీ, అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. గ్రామ గ్రామాన ప్రచార యాత్రలో ప్రజలు, మహిళలు ఘన స్వాగతం పలికారు.

వైసీపీ నేతలు ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల కేంద్రంలో వైసిపి మైలవరం అభ్యర్థి సర్నాల తిరుపతిరావు, విజయవాడ పార్లమెంటు అభ్యర్థి కేశినేని నాని విజయం కోసం వైసిపి శ్రేణులు రాఘవాపురంలో ప్రారంభించారు.

సామినేని ప్రచారం

పెనుగంచిప్రోలు: మండల పరిధిలోని తోట చర్ల, శనగపాడు, వెంగానాయకుని పాలెం, వెంకట పురం, పొన్నారం, కొళ్ళి కూళ్ళ, సుబ్బాయిగూడెం, గ్రామాల్లో మంగళవారం జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సామినేని ఉదయభాను ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ప్రచారానికి అడుగు అడుగున ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుపతమ్మను దర్శించుకున్న ప్రముఖులు

పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ టి.చంద్రకుమార్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం, శేష వస్త్రం, ప్రసాదం అందజేశారు. ఆలయ ఈఈ వైకుంఠరావు ఏఈఓ తిరుమలేశ్వరరావు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని సార్వత్రిక ఎన్నికల ఎన్టీఆర్ జిల్లా జనరల్ అబ్జర్వర్ నరేంద్ర సింగ్‌బాలి,

జగ్గయ్యపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డిప్యూటీ కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు మంగళవారం శ్రీ తిరుపతమ్మ

దర్శనానికి వచ్చిన అధికారులు

అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి వేద ఆశీర్వచనం శేష వస్త్రం, తీర్థ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జోరుగా అభ్యర్థుల ప్రచారం

మండలి వెంకట్రామ్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గం జనసేన అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ అవనిగడ్డ రామకోటీపురం పంచాయతీలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు మంగళవారం ఆయన అవనిగడ్డ మూడో వార్డులో ఇంటింటికి వెళ్లి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి బుద్ధ ప్రసాద మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరిలకు గాజు గ్లాస్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీ పరిధిలోని కొత్తపేట రామకోటీపురం గ్రామపంచాయతీలో కూడా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను టిడిపి నాయకులు యాసం చిట్టిబాబు గుడివాక శేషుబాబు ఎలవర్తి చిన్న ఘంటసాల కన్యయ్య తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు బండే కనకదుర్గ పాల్గొన్నారు.

వైసిపి ప్రచారం

ప్రజాశక్తి - అవనిగడ్డ : వైసిపి అవనిగడ్డ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ మండల పరిధిలోని మోదుమూడి గ్రామంలో సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సందర్భంగా గ్రామ్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో ఇరువురు అభ్యర్థులు పాల్గొని ప్రతి ఇంటికి సంక్షేమానికి సచివాలయాల ఏర్పాటు రైతు భరోసా కేంద్రాలు వెల్నెస్ సెంటర్లు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. బందరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి తమ ఇరువురిని గెలిపించాలని ఓటర్లను కోరారు



మాట్లాడుతున్న బుద్ధ ప్రసాద్

నేడు క్రికెటర్ అంబటి రాయుడు పర్యటన

ప్రజాశక్తి - అవనిగడ్డ : ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు జనసేన పార్టీ అభ్యర్థులు వల్లభనేని బాలశౌరి, మండలి బుద్ధ ప్రసాద్ గెలుపును కోరుతూ బుధవారం అవనిగడ్డలో పర్యటించనున్నట్లు జనసేన అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాయంత్రం నాలుగు గంటలకు మోపిదేవిలోని ఎస్ విహార్ హోటల్ నుండి భారీ ప్రదర్శనతో ర్యాలీగా అవనిగడ్డ చేరుకుంటారని సాయంత్రం ఐదు గంటలకు అవనిగడ్డ రాజీవ్ గాంధీ సెంటర్లో బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు అనంతరం అవనిగడ్డ నుండి ప్రచార రథం పై మండలి బుద్ధ ప్రసాద్ తో కలిసి ప్రచారం నిర్వహిస్తూ కొత్తపేట రామచంద్రపురం మాచవరం మీదగా దక్షిణ చిరువోలు లంక గ్రామానికి వెళ్ళనున్నట్లు బుద్ధ ప్రసాద్ తెలిపారు

వల్లభనేని బాలశౌరి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ పట్టణంలోని 30, 22, 21, 25 వార్డుల్లో విస్తృత ప్రచారాన్ని మాజీ ఎంపీ బాలసౌరి, టిడిపి అభ్యర్థి వెనిగండ్ల రాము మంగళశవారం నిర్వహించారు. ఎక్కడికక్కడ తమ సమస్యలను నాయకులకు వివరించడంతో ప్రతి ఒక్కరి సమస్యను ఓపికగా వింటూ తాము ఉన్నామన్న భరోసా కల్పించారు. ఎన్నికల ప్రచారంలో సీనియర్ టిడిపి నాయకులు డాక్టర్ గోర్జి సత్యనారాయణ, పట్టణ టిడిపి అధ్యక్షులు దింట్యాల రాంబాబు, జనసేన పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్, టీడీపీ, జనసేన, కార్యకర్తలు పాల్గొన్నారు.

కెబిఎన్‌లో కంప్యూటర్ కోర్సులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ :

కాకరపర్తి భావనారాయణ కళాశాలలో కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో స్వల్పకాలిక కంప్యూటర్ కోర్సులను నిర్వహించ నున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణ రావు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం వేసవి సెలవులను పురస్కరించి చకాని తక్కువ ఫీజుతో ఈ కోర్సులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఎస్ ఆఫీస్, టాలీప్రైమ్, కోర్సులను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు నెలల కాలపరిమితితో ఈ కోర్సులను అందిస్తున్నామని తెలిపారు. రోజు ఒక గంట తరగతి బోధనతో పాటుగా మరో గంట ల్యాబ్ సదుపాయాన్ని అందిస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెం 9849517440కు సంప్రదించాలని కోరారు.

ఎన్నికల దృష్ట్యా మద్య నిషేధం అమలు చేయాలి

ప్రజాశక్తి - భవానీపురం :

రాష్ట్రంలో మద్య నిషేధం వెంటనే అమలు చేస్తేనే ఎన్నికల్లో 100 శాతం పోలింగ్ జరుగుతుందని గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు గాంధీ నాగరాజన్ చెప్పారు. మంగళవారం ఊర్మిళానగర్‌లోని గాంధీ ట్రస్ట్ కార్యాలయంలో మహాత్మా గాంధీని గాడ్సే హత్య చేసిన 30వ తేదీని పురస్కరించుకొని దానికి నిరసనగా కళ్ళకు నల్ల రిబ్బన్ కట్టుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు గాంధీ నాగరాజన్ నిరాహార నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటినుండే దేశవ్యాప్తంగా, అలాగే రాష్ట్రంలోనూ మద్య నిషేధాన్ని అమలు చేయాలని తాను ఎన్నికల కమిషన్‌కు గతంలో లేఖ రాయడం జరిగిందని అన్నారు. అయితే తన సూచనను పరిగణన లోకి తీసుకోపోవడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బాధ్యురాలు బంగారు భారతి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ. 1.91 కోట్లు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి మహామండపం ఆరవ అంతస్తులో మంగలవారం హుండీల లెక్కింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. 15 రోజులక సంబంధించిన హుండీల లెక్కించగా నగదు: రూ.1,91,27,261 లు, బంగారం: 370 గ్రాములు, వెండి: 3 కేజీల 850 గ్రాములు భక్తులు హుండీ ద్వారా సమర్పించుకున్నారు. అలాగే విదేశీ కరెన్సీ ద్వారా యుఎస్‌ఏ- 516 డాలర్లు, ఓమన్ – 100 బైసా, యు.కె – 20 పౌండ్లు, ఇంగ్లాండ్ – 40 పౌండ్లు, ఆస్ట్రేలియా – 100 డాలర్లు, కెనడా – 15 డాలర్లు, యూరో- 5 యూరోలు, సింగపూర్ – 2 డాలర్లు, యుఏఇ – 25 దిర్హమ్స్, కువైట్ – 1 దినార్, ఖతార్- 24 రియాల్స్, కొరియా – 1000 వాన్‌లు భక్తులు సమర్పించారు. కాగా ఆన్‌లైన్ ఈ- హుండీ ద్వారా రూ.44,831లు సమర్పించారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్ రామారావు, సహాయ కార్యనిర్వాహణాధికారులు, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది, ఎస్‌పిఎఫ్ మరియు వన్‌టౌన్ పోలీసు సిబ్బంది, భవానీ సేవా దారులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆసిఫ్‌కు సత్కారం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా అందిస్తామని ఆ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. షేక్ ఆసిఫ్‌ను భవానీపురం పార్టీ కార్యాలయంలో ఐటీవల ఆ పార్టీలో చేరిన పోతిన మహేష్ మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు.

దుర్గగుడి కళావేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఇంద్ర కీలాద్రి విజయ వాడ నందు కొండపై ఏర్పాటు చేసిన కళావేదికపై మంగళవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్య క్ర మాలు పలు వురిని అల రిం చాయి. నిత్య నీరా జనం కార్యక్ర మం లో భాగం గా విజయ వాడ భవానీ పురంకు చెందిన శ్రీ శారద నృత్య కళాపీఠం వారి ఆధ్వర్యం లో జార్గం డ్కు చెందిన తరిత్ సర్కార్ వారు కథక్ నత్యం, వెస్ట్ బెంగాల్‌కు చెందిన హేమంత్ విశ్వకర్మ వారు మణిపూరి నృత్యాలు ప్రదర్శించడం జరిగింది. వీరు అమ్మవారి సన్నిధిలో నృత్య ప్రదర్శన కోసం అంత దూరం నుంచి వచ్చి ప్రదర్శించడం చాలా మరపురాని అనుభూతిగా చెప్పారు. వీరితో పాటు శ్రీ శారద నృత్య కళాపీఠం భవానీపురం నాట్యాచార్య సంతోష్ వారి ఆధ్వర్యంలో పిల్లలు భరతనాట్యాన్ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది.

సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాకారులు

పెత్తందారులను తరిమికొట్టండి : రామకృష్ణ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పేరుప్రఖ్యాతలు ఉన్న విజయవాడ నగరంలో ఈ ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థి గెలిస్తే అది ప్రజా విజయం అవుతుందని, బీజేపీ గెలిస్తే డబ్బుకే ప్రజలు పట్టం కట్టినట్లు అవుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ప్రజల కోసం కష్టపడే వ్యక్తి నిత్యం మీతోనే ఉండే సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావును ఈ ఎన్నికల్లో గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్, సీపీఎం పార్టీలు బలపర్చిన విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు, విజయవాడ పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వల్లూరు భార్గవ్ విజయాన్ని కాంక్షిస్తూ సీపీఐ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో రోడ్ షో ప్రారంభం సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్దేశించేలా జరుగుతున్న ఈ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జి.కోటేశ్వరరావు గతంలో కార్పొరేటర్‌గా పనిచేసి ప్రజాసమస్యలను పరిష్కరించారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి వల్లూరు భార్గవ్‌కు 'హస్తం' గుర్తుపై, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి జి.కోటేశ్వరరావుకు 'కంకి- కొడవలి' గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కులాల, మతాల మధ్య కుంపట్లు పెడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో అన్ని కులాల, మతాల వారు కలిసిమెలిసి ఉండాలనే ఉద్దేశ్యంతో ఇండియా వేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవానీ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ షోలో మాట్లాడుతున్న రామకృష్ణ

శ్రీ శ్రీ 114వ జయంతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : రసమయి సాహితీ సమితి జగ్గయ్యపేట ఆధ్వర్యంలో మంగళవారం మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు 114 వ జయంతి కార్యక్రమం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రసమయి సాహితీ సమితి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు, ప్రముఖ కవి, రచయిత, ఉపాధ్యాయులు దోసపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన శ్రీశ్రీ సాహితీ ప్రస్థానం వివరించారు. కలం పట్టిన దగ్గర్నుంచి ఏడున్నర ఏళ్ళవయసులోనే పద్యం రాసి సాహితీ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేసిన శ్రీ శ్రీ అనంతరం కష్టజీవుల కోసం తనసాహిత్యాన్ని అంకితం చేశారు. తెలుగు సాహితీ చరిత్ర ఉన్నంతవరకు శ్రీశ్రీ బ్రతికే ఉంటారని మహాప్రస్థానం మరో వెయ్యేళ్ళైనా సరే అలాగే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలనాధికారి ఆలేటి ప్రభ, గ్రంథాలయ సిబ్బంది సత్యవతి, రమేష్ పాల్గొన్నారు.

మహాకవి శ్రీ శ్రీ కి నివాళి

ప్రజాశక్తి - తిరువూరు : మహాకవి శ్రీ శ్రీ జయంతిని తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి జెవివి నాయకులు, విద్యార్థులు పూలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా ప్రధాన కార్య దర్శి ఎల్. గంగాధర్ మాట్లాడుతూ శ్రీశ్రీ జీవిత విశేషాల ను వివరించారు. ఈ కార్యక్రమంలో జెవివి ప్రతినిధులు ఎం. రాంప్రదీప్, డి. సుదర్శన్, ఎం. సుధాకర్, ఎస్ డి.సుభానీ, జి.సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విస్సన్నపేట : స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన సానం రమేష్ ముదిరాజ్‌కు అస్వస్థతకు గురై చికిత్స చేయించుకుంటున్న రామకృష్ణకు లలితా రామకృష్ణ రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. వైద్యఖర్చుల నిమిత్తం ఈ సాయాన్ని అందజేశారు.

దేవస్థానం భూములకు వేలంపాటలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి చెందిన వత్సవాయి మండలం భీమవరం గ్రామంలోని సర్వే నెం.60లో య.19.60 సెంట్లు భూమికి మే 2వ తేదీ ఉదయం 11 గంటలకు వత్సవాయి మండలము భీమవరం గ్రామ పంచాయతీ కార్యాలయం, పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం గింజుపల్లి గ్రామంలోని సర్వే నెం.లు 87బి3, 73లో య.3.08, య.7.86 సెంట్లు భూములకు గింజుపల్లి శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయములో దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో మే 3వ తేదీ ఉదయం గం.11.00 ల నుండి భూముల కౌలుకు సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలం నిర్వహించబడునని దేవస్థాన కార్యనిర్వహణాధికారి శిరపరపు హేమలత దేవి తెలిపారు.

చంద్రబాబువి దగాకోరు హామీలు : ఆకుల

ప్రజాశక్తి - భవానీపురం : ఎన్నికల కోసం చంద్రబాబు దగాకోరు హామీలతో మేనిఫెస్టో తయారుచేసి మళ్ళీ ప్రజల ముందుకు వచ్చారని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ ఘాటుగా విమర్శించారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అలవికాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని ఆకుల ధ్వజమెత్తారు. గత 2014 ఎన్నికల సందర్భంగా అధికారం కోసం 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు వాటిలో ఏ ఒక్కటి అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేశాడని విమర్శించారు. అందుకే ఈసారి విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రధాని మోడీ బొమ్మ లేకుండా బీజేపీ నాయకులు జాగ్రత్త పడ్డారని ఎద్దేవా చేశారు.

వైసిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి - గంపల గూడెం: ఎన్నికలు దగ్గర పడు తున్న నేపథ్యంలో వివిధ పార్టీలు విస్తృతంగా పర్యటించి, క్యాం పెయిన్ నిర్వహి స్తున్నారు. అందులో భాగంగా కనుమూరు గ్రామంలో మంగళవారం రాత్రి ఇంటింటా ప్రచారం వైసిపి నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్ళగా జగన్ పరిపాలన మంచిని వివరించి, ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు చెరుకు నరసారెడ్డి ఏఎంసి డైరెక్టర్ వజ్రాల శ్రీనివాస్ రెడ్డి, గొర్ల సత్యనారాయణ రెడ్డి, అత్తనూరి శివారెడ్డి, చెరుకు భాస్కర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



3న విదేశీ విద్యపై అవగాహనా సదస్సు

అజంట్ ఓవర్సీస్ ఆధ్వర్యంలో నిర్వహణ - అమెరికా, కెనడా విశ్వవిద్యాలయాల ప్రతినిధులు రాక

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : అజంట్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మే 3వ తేదీ ఉదయం ఎం.జి.రోడ్డులోని అజంట్ ఓవర్సీస్ కార్యాలయంలో ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను నిర్వహించనున్నట్లు అజంట్ విజయవాడ శాఖ మేనేజర్ ప్రశాంత్ తెలిపారు. ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం ఎం.జి.రోడ్డులోని కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ విదేశీ విద్యపై ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని, అటువంటి వారికి సరైన గైడెన్స్, మంచి యూనివర్శిటీలో కోర్సులను తెలియచేయాలనే ఉద్దేశంతో ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి అమెరికా, కెనడా దేశాల నుండి విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొంటారని, స్వయంగా వారి విశ్వవిద్యాలయాల్లో అందించే కోర్సుల వివరాలను విద్యార్థులకు తెలియచేస్తారన్నారు. ఎం.జి.రోడ్డులోని అజంట్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కార్యాలయంనందు ఉదయం 11.30 గంటల నుండి మద్యాహ్నం 3.30 గంటల వరకు ఈఫెయిర్ జరుగుతుందని తెలిపారు. హవాయ్ ఫసిఫిక్ యూనివర్శిటీ, ది యూనివర్శిటీ ఆఫ్ ఆరిజోనా, సెయింట్ జార్జెస్ యూనివర్శిటీ , వెబ్‌స్టార్ యూనివర్శిటీ, హార్ట్‌విక్ కాలేజ్, డ్రెక్సల్ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, యూనివర్శిటీ ఆఫ్ డేటన్, తదితర వర్శిటీల ప్రతినిధులు స్వయంగా పాల్గొంటారని తెలిపారు. వివరాలకు ఎం.జి.రోడ్డులోని అజంట్ విజయవాడ కార్యాలయంలో గాని లేదా 0866- 6912525 ఫోన్ ద్వారా గానీ తెలుసుకోవచ్చని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

మేడే సందర్భంగా కొబ్బరి చిప్ప, ఇటుకపై శ్రామిక దంపతులు, శ్రామిక మహిళ చిత్రాలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మేడే సందర్భంగా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన చిత్రకారుడు అల్లి చంద్రశేఖర్ కొబ్బరి చిప్పపై శ్రామిక దంపతులు పనిచేస్తున్న దృశ్యాన్ని ఎరుపు రంగు పెన్నుతో, మహిళ కార్మికురాలు భోజన విరామ సమయంలో బాబును నెత్తిపై కూర్చోబెట్టుకున్న చిత్రాన్ని బ్లాక్ మార్కర్ పెన్నుతో ఇటుకపై షార్ట్ పేపర్ కత్తిరింపుతో చిత్రాన్ని గీశారు.

జుట్టు సంరక్షణకు అలోవేరా ఉత్పత్తులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : జట్టు సంరక్షణకు, అలోవేరా కొబ్బరి నూనె ఎంతగానో ఉపయోగపడుతుందని అలోవేరా సంస్థ ప్రతినిధి కె.ఎం.కె. ప్రసాద్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని ఓహోల్‌లో నూతన కొబ్బరి నూనె ఉత్పత్తుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంతో ప్రతి ఒక్కరూ జట్టును సంరక్షించుకోవడంతో పాటు అందంగా ఉంచుకునేందకు ఎక్కువగా ఇష్టపడుతున్నారన్నారు. అటువంటి వారికి అలోవేరా, కొబ్బరి నూనె ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. అలోవేరా హెయిర్ ఆయిల్‌లో మంచి పోషకాలు ఉన్నాయని, విటమిన్లు, మినరల్స్ కూడా పుస్కలంగా ఉంటాయన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ జట్టు సంరక్షణకు అలోవేరా నూనె ఉత్పత్తులను వినియోగించుకోవాలని కోరారు.

భీమా జ్యూవెలర్స్‌లో అక్షయ తృతీయ ఆఫర్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అక్షయ తృతీయ శుభ సందర్భంగా నగరంలోని భీమా జ్యూవెలర్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నట్లు షోరూమ్ మేనేజర్ ఈశ్వర్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం నగరంలోని షోరూమ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుండి 8వ తేదీ వరకు ప్రత్యేక ఆఫర్లు ఉంటాయన్నారు. అడ్వాన్స్ బుకింగ్ ఆఫర్‌ల ద్వారా అదనపు ప్రయోజనాలు పొందేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కస్టమర్లు 10 శాతం అడ్వాన్స్ చెల్లించి ప్రస్తుతం ఉన్న బంగారం ధరపై గ్రాముకు రూ.100లు తక్కువలో ఆభరణాలు సొంతం చేసుకోవచ్చని తెలిపారు. మే 9వ తేదీ నుండి 12వ తేదీ వరకు వినియోగదారులకు బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.500లు వరకు తగ్గింపు ఉంటుందన్నారు. వజ్రాభరణాలపై క్యారెట్‌కు రూ.7వేలు ఫ్లాట్ క్యాష్ బ్యాక్‌తో పాటు రూ.1 లక్ష వరకు ఉచిత బహుమతులను పొందొచ్చని తెలిపారు.

విద్యార్థులు పరిశోధనలను పెంచుకోవాలి

- వివిఐటితో పిబి సిద్దార్థ కళాశాల ఒప్పందం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థులకు పరిశోధనల పట్ల ఆసక్తి కలిగించి వారిని ప్రోత్సహించే దశలో నగరంలోని పిబి సిద్ధార్థ కళాశాల, వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆప్‌టెక్నాలజీ నంబూరు కళాశాలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పిబి సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ మేనా రమేష్ తెలిపారు. మొగల్‌రాజపురంలోని కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఒప్పందం వలన పరిశోధనలతో పాటు, పాఠ్య ప్రణాళికలను రూపొందించడంలోనూ, అద్యాపకులకు సంబంధించి ప్రత్యేక బోధన, కంప్యూటర్ పరిజ్ఞానం వంటి వాటిని విద్యార్థులకు అందించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో పిబి సిద్దార్థ కళాశాల కంప్యూటర్స్ సైన్సు విభాగాధిపతి డాక్టర్ టి.ఎస్.రవికిరణ్, పిబి సిద్దార్థ కళాశాల ఇన్‌ఛారి కె.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ధాన్యం బకాయిలు చెల్లించాలి

గొల్లపూడి మార్కెట్ యార్డ్ వద్ద ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ

గొల్లపూడి మార్కెటింగ్ యార్డు ఆఫీస్ ముందు ధర్నా చేపట్టిన రైతులతో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి. కృష్ణ

ప్రజాశక్తి - భవానీపురం : ఏ కొండూరు రైతుల వద్ద చాలాకాలం క్రితం ధాన్యం కొనుగోలు చేసిన మార్కెటింగ్ యార్డ్ అధికారులు వారికి డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయటంతో తప్పని పరిస్థితుల్లో మంగళవారం రైతులు గొల్లపూడిలోని మార్కెట్ యార్డ్ ఆఫీస్ వద్ద ధర్నాకు దిగారు. ఈ ధర్నాలో సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ పాల్గొని వారికి మద్దతుగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే 2020-21వ సంవత్సరంలో వరి ధాన్యం ఏ కొండూరులోని 14 మంది గిరిజన, కౌలు రైతుల నుండి ఏ కొండూరు మార్కెట్ యార్డ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసింది. దానిలో సగం డబ్బు చెల్లించారు. మిగిలిన రూ.10,87,000 గత నాలుగు సంవత్సరాలు గడిచినా ఇంత వరకు ఇవ్వలేదు. రైతులు రాష్ట్ర, జిల్లా అధికారులు చుట్టూ తిరిగినా అదిగో, ఇదిగో అంటూ డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేశారు. ఏప్రిల్ 30న గొల్లపూడి మార్కెట్ యార్డ్‌కి రైతులను మీ డబ్బులు శాంక్షన్ అయ్యాయి, విచారణ కోసం రమ్మని పిలిచారు. తీరా వచ్చిన రైతులకు మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ మీడబ్బులు ఇవ్వటానికి ఇంకా 2,3 నెలల సమయం పడుతుందని చెప్పారు. జాయింట్ డైరెక్టర్ మాటలకు ఆందోళన చెందిన రైతులు మంగళవారం గొల్లపూడి మార్కెటింగ్ యార్డ్ ఆఫీస్ ముందు ధర్నాకు దిగారు. ఈ ధర్నాలో సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ పాల్గొని మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల నుండి రైతులను ధాన్యం డబ్బులు కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ మార్కెటింగ్, సివిల్ సప్లై ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. పేద, కౌలు రైతులు అప్పులు చేసి పంటలు పండించి ధాన్యం అమ్మిన డబ్బులు రాక అప్పులకు వడ్డీ పెరిగి దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అన్నారు. ధాన్యం బకాయిలు చెల్లించే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదని అయన రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. సమస్యని జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మార్కెటింగ్ అధికారులు సాద్యమైనంత త్వరగా డబ్బులు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ సమస్య పరిష్కారం చేయకపోతే నిరవధిక బైటాయింపు చేస్తామని డి.వి.కృష్ణ హెచ్చరించారు. ఈ ధర్నాలో సిపిఎం ఎ.కొండూరు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరావు, రైతులు వేంపాటి శ్రీను, కేవ్లా, వెంకటేష్, వెంకటేశ్వరావు, కుచ్చా పాల్గొన్నారు.

హై 5యూత్ ఫౌండేషన్ అధ్యక్షురాలికి నంది అవార్డు

ప్రజాశక్తి - గుడ్లవల్లేరు : వాసవి జాగృతి ఇంటర్నేషనల్ ఫౌండర్, మెంబర్, హై5 యూత్ ఫౌండేషన్ అధ్యక్షురాలు కొల్లిపర అనసూయ సోమవారం రాత్రి ఢిల్లీ రాజ్ భవన్‌లో నంది అవార్డు అందుకున్నట్లు హై5 ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గోట్రు నాగబాబు తెలిపారు. ఈ సందర్భంగా అనసూయ మాట్లాడుతూ తన భర్త కొల్లిపర ప్రార్థసారథి నాగేశ్వరరావు ప్రోత్సాహంతో గత 25 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా రాష్ట్ర స్థాయిలో నంది అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. తనకు ఈ అవార్డు రావడంతో మరింత బాధ్యతలు పెంచాయని అన్నారు. ఈ సందర్భంగా హై 5 యూత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గోట్రు నాగబాబు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రభుత్వం చే గుర్తింపు పొందిన హై 5 యూత్ ఫౌండేషన్ 17 సంవత్సరాల నుంచి అనేక సేవా కార్యక్రమాలు, విద్య వైద్యం శుభ్రతల గురించి అవగాహన కార్యక్రమాలు చేస్తూ ప్రతి రోజూ ఒకరికైనా భోజనం పెట్టాలి అనే నినాదంతో తలపెట్టి ప్రతి రోజూ ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ నేపథ్యంలో తమ సంస్థ నుంచి ఇంటర్నేషనల్ సంస్థ అయిన శిఖరం ఆర్ట్స్ ధియేటర్ వారు ఢిల్లీ ఏపీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నుంచి తమ సంస్థ అధ్యక్షురాలు కొల్లిపర అనసూయ అందుకోవడం సంస్థ వ్యవస్థాపకుడిగా సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డులు సంస్థకు గౌరవ మర్యాదలు తిసుకువస్తూనే మరింత బాధ్యతలు పెంచాయన్నారు.

సజావుగా ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా, నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు ప్రతినిధులు అభ్యర్థులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కోరారు.మచిలీపట్నం లోక్ సభ స్థానానికి పోటీలో ఉన్న అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం కలెక్టరేట్ స్పందన మీటింగ్ హాల్లో ఎన్నికల సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు, పోలీస్ పరిశీలకులతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని, ఇందుకు సహకరించిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. ఇదేవిధంగా ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. మచిలీపట్నం లోక్ సభ స్థానానికి 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పరిశీలనకు ఎన్నికల సంఘం ఆయా నియోజకవర్గాలకు ఇద్దరు సాధారణ పరిశీలకులు, ముగ్గురు వ్యయ పరిశీలకులు, ఒకరు పోలీస్ పరిశీలకులను నియమించిందని అన్నారు. ఈవీఎం రాండమైజేషన్ ప్రక్రియ కలెక్టర్ వివరిస్తూ ఆయా నియోజకవర్గాలకు ఆయా పోలింగ్ కేంద్రాలకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్ లను కేటాయించడం, ఈవీఎం కమీషనింగ్ ప్రక్రియలు జరుగుతాయన్నారు. మే 4న ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రొసైడింగ్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులకు, మే నెల 5 వ తేదీన ఓపిఓ లకు, మే నెల 6వ తేదీన పోలీస్ పర్సనల్, ఎసెన్షియల్ సర్వీసెస్, డ్రైవర్లు, వీడియో గ్రాఫర్లకు పోస్టల్ ఓటింగ్ కొరకు ఆయా అసెంబ్లీ హెడ్ క్వార్టర్స్ లో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా తేదీల్లో పోస్టల్ ఓటింగ్ కు మిస్సయిన ఓటర్లకు మే 7, 8 తేదీల్లో కూడా వీటిని కొనసాగించనున్నట్లు తెలిపారు. 85 ప్లస్, దివ్యాంగులకు హెూమ్ ఓటింగ్ సౌకర్యం ఎన్నికల సంఘం కల్పించిందని, మే నెల 2 - 8 తేదీల మధ్య, లెఫ్ట్ ఓవర్ ఓటర్లకు మే 9, 10 తేదీల్లో హెూమ్ ఓటింగ్ బృందాలు ఇంటింటికి వెళ్లి హోమ్ ఓటింగ్ నిర్వహిస్తాయని తెలిపారు. పోలింగ్ కౌంటింగ్ ముగిశాక 25 నుండి 30 రోజులలోపు ఎన్నికల వ్యయం సరిచూచుటకు సమావేశం నిర్వహిస్తామని, అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయం పై సమగ్ర నివేదిక సమర్పించాల్సి ఉంటుందని, లేనియెడల అనర్హులవుతారని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా పాటించాల్సి ఉంటుందని, క్రిమినల్ యాంటిసిడెంట్స్ ఒక జాతీయ, ఒక లోకల్ పత్రికలతో పాటు ఒక టీవీ ఛానల్ లో ప్రకటించవలసి ఉంటుందన్నారు.డిఆర్ఓ కే. చంద్రశేఖర రావు మాట్లాడుతూ కలెక్టరేట్లో మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ సెల్, వాహన అనుమతులు, ఎన్నికల వ్యయ%శీ%, ఫిర్యాదుల విభాగాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, మచిలీపట్నం పార్లమెంటు స్థానానికి పోటీలో ఉన్న అభ్యర్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.